
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
సోమవారం 2 డిసెంబరు 2024



స్వచ్ఛజలం.. అందేనా?


తాగునీటి చెరువు

జల్‌జీవన్‌తో..
ప్రతీ ఇంటికి కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీరు అందించాలి. గ్రామీణుల ఆరోగ్యాల్ని పరిరక్షించాలి. 2024 మార్చి కల్లా పనులు పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. కానీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో జల్‌జీవన్ పనుల్లో పురోగతి కనిపించడంలేదు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు తాగునీటి పథకాల అభివృద్ధిని విస్మరించింది. దీంతో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందని ద్రాక్షలా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేయకపోవడంతోనే జల్‌జీవన్ మిషన్ అమలులో జాప్యం జరిగింది. నిధుల కొరతతో బిల్లుల చెల్లింపులు జరగక పోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలివేశారు. కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేయగా రాష్ట్ర ప్రభుత్వం వాటిని దారిమళ్లించడంతోనే పనులు ముందుకు సాగలేదు. జలజీవన్ అమలులో పల్నాడు, బాపట్ల జిల్లాలు రాష్ట్రంలోనే చిట్టచివర స్థానాల్లో ఉన్నాయంటే అధికారుల పనితీరు తెలుస్తోంది. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛజలం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో ఈ పథకం పనులు అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది.


శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంక్

- ముందుకు సాగని జలజీవన్
- గ్రామాల్లో తాగునీటి వెతలు తీవ్రం
- నిధులున్నా పనుల నిర్వహణలో నిర్లక్ష్యం
- ప్రతి ఇంటికి అందని ద్రాక్షాలా స్వచ్ఛమైన తాగునీరు
- పథకం అమల్లో రాష్ట్రంలోనే చిట్టచివరన పల్నాడు, బాపట్ల జిల్లాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

స్వచ్ఛమైన.. సురక్షితమైన.. తాగునీటిని ప్రతి ఒక్కరికీ అందించాలి. ప్రధానంగా ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో తాగునీటి పథకాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి కుళాయిల ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను చేపట్టింది. ఇంటింటికీ స్వచ్ఛజలాన్ని సరఫరా చేసే సంకల్పంతో 2019లో ఈ పథకం అమల్లోకి తెచ్చింది. కేంద్ర ప్రభుత్వ లక్ష్యమైన కుళాయిల ద్వారా తాగునీరు అందివ్వడం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో కష్టంగా మారింది. ప్రస్తుతం ఉన్న నీటి పథకాల ద్వారా ప్రతి వ్యక్తిగా 40 లీటర్లు నీరు అందుతుంది. జల్‌జీవన్ పథకం ద్వారా ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వాల్సి ఉంది. తాగునీటి పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి ప్రతి గ్రామంలో నూరు శాతం కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేయడమే ఈ పథకం లక్ష్యం. ఇందుకు రూ.1021.38 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేరి సగం నిధులతో జల్‌జీవన్ పనులు చేపట్టారు. కేంద్రం తన వాటాలో సుమారు రూ.275 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిన విషయం తెలిసిందే. 2024 మార్చి కల్లా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. అయితే రాష్ట్రంలో వైసీపీ పాలకుల తీరుతో లక్ష్యం నీరుగారిపోయింది. జలజీవన్ మిషన్

కుళాయిలు.. 43.88 శాతం

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో 10,32,904 గృహాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 4,53,251 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. అంటే స్వచ్ఛజలం కుళాయిల ద్వారా 43.88 శాతం గృహాలకే అందుతోంది. ఇంకా 5,79,653 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాలి. గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. కుళాయిలు కూడా నామమాత్రంగానే ఉన్నాయి. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపు లైన్లు, తాగునీటి చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాల్సి ఉంది. మూడు జిల్లాల పరిధిలో జల్‌జీవన్ పథకం పనులు నత్తనడక కన్నా నిదానంగా సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించక పోవడం గమనార్హం.

కుళాయిలు ఇలా..

జిల్లా	గృహాలు	కుళాయిలున్న ఇళ్లు	లేని ఇళ్లు
పల్నాడు	4,34,399	1,47,166	2,87,233
గుంటూరు	2,33,717	1,57,724	75,993
బాపట్ల	3,64,788	1,48,361	2,16,427

బాపట్ల జిల్లా 25వ స్థానం

బాపట్ల జిల్లా జలజీవన్ అమలులో రాష్ట్రంలో 25వ స్థానంలో నిలిచింది. జిల్లా పరిధిలోని గ్రామాల్లో 3,64,788 గృహాలు ఉండగా జల్‌జీవన్ ప్రారంభించే నాటికి 72,292 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 76,069 గృహాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. అంటే జిల్లాలో మొత్తం 1,48,361 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. 19.82 శాతం నుంచి 40.67 శాతానికి కుళాయిల సంఖ్య పెరిగింది. ఇంకా 2,16,427 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి. రూ.205.22 కోట్లు వ్యయం అంచనాతో జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టారు. చేపట్టిన పనుల్లో 223 పనులు పూర్తయ్యాయి.

పథకం పనుల్లో పురోగతి

(మిగతా 7వ పేజీలో..)

- జిల్లా కేంద్రంలో ఇంకా అరకొర వసతులే
- ఇరుకు గదుల్లోనే పలు జిల్లా కార్యాలయాలు
- కార్యాలయాల్లో సిబ్బందికి.. ఫర్నీచర్‌కూ కొరతే
- ప్రైవేటు భవనాల్లోనే పలు శాఖల కార్యాలయాలు
- ప్రతిపాదనల దశలోనే సమీకృత కలెక్టరేట్ నిర్మాణం

రెండున్నరేళ్లయినా.. తప్పటడుగులే..


ఓ కళాశాల భవనంలో కొనసాగుతున్న జిల్లా విద్యాశాఖ కార్యాలయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పరిపాలనా సౌలభ్యం పేరుతో లోక్‌సభ నియోజకవర్గాల ప్రాతిపదికగా గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజన జరిగి రెండున్నరేళ్లు అవుతుంది. అయితే ఇంకా తప్పటడుగుల్లోనే జిల్లా పరిపాలన సాగుతోంది. పూర్తి స్థాయిలో ఇంకా కార్యాకలాపాలు జరగడం లేదు. కొత్త జిల్లా ఏర్పాటుతో పరిపాలన అందుబాటులోకి వస్తుందని ఆశ పడిన ప్రజలు జరుగుతున్న పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హడావిడిగా జిల్లా ఏర్పాటుకు పూనుకుందే తప్ప పాటించాల్సిన నిబంధనలను పట్టించుకోలేదు. జిల్లా ఆవిర్భావం సమయంలోనే ప్రత్యేక నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ అలాంటి ప్రయత్నమేమీ జరగలేదు. దీంతో ఏ ఒక్క కార్యాలయంలోనూ కనీస సదుపాయాలు, ఉండాల్సిన నిష్పత్తిలో సిబ్బంది లేకపోవడంతో అరకొర వనరులతోనే కార్యాలయాలను నడిపించాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలో కార్యాలయాలు ఉన్నా కొందరు అధికారులు, ఉద్యోగులు ఇంకా గుంటూరు నుంచే విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయాల్లో వసతులు లేక ఉద్యోగులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రైవేట్ భవనాల్లో కొన్ని కార్యాలయాలు ఏర్పాటు కాగా ప్రభుత్వం నిర్ణయించిన అద్దె సరిపోక అధికారులు సొంతంగా చెల్లించాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. జిల్లాకు సంబంధించి బాపట్ల కేంద్రంగా పూర్తి స్థాయిలో కార్యాకలాపాలు జరగడం లేదు. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు, వారి నివాసాలకే వసతులు పరిమితమయ్యాయి. కొన్ని ప్రధాన కార్యాలయాలకు నేటికీ కూడా కనీసం ఫర్నిచర్ సరఫరా చేయలేదు. కనీస వసతులు లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారుల నియామకాలు జరగలేదు. జిల్లా అధికారుల పోస్టులను మంజూరు చేసిన గత ప్రభుత్వం నియామకాలను విస్మరించింది. రెండున్నరేళ్ల నుంచి వెంటాడుతున్న బాలారిష్టాలకు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం దొరుకుతుందని పలువురు ఆశ పెట్టుకున్నారు. కానీ ఇటీవల జరిగిన బదిలీల్లో సిబ్బంది నియామకం దగ్గర నుంచి జిల్లా అధికారుల పోస్టుల వరకు పాత తంతే నడవడం నిరాశపర్చింది. అటు సిబ్బంది విషయంలో కానీ, ఇటు ఖాతాల విభజన అంశంలో కానీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉంది తప్పితే ఎలాంటి మార్పు లేదు. జిల్లా ఏర్పాటు సమయంలోనే అదనంగా జిల్లా స్థాయి పోస్టులను నోటిపై చేయాలి. కానీ ఆ పని చేయకపోవడంతో ఇప్పుడు చాలా విభాగాలు ఇన్‌చార్జిలతోనే నెట్టుకరావాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నాయి.

డజనుకుపైగా శాఖల్లో ఇన్‌చార్జిలే దిక్కు..

బాపట్ల జిల్లా ఏర్పాటులో అధికారులకు సంబంధించి కొత్త పోస్టులు నోటిఫికేషన్ చేయకపోవడంతో చాలా విభాగాలను ఇన్‌చార్జి హోదాలతోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి ఉంది. టూరిజం, మెప్మా, డీఆర్‌డీఏలకు ఇన్‌చార్జి అధికారులే దిక్కుగా ఉన్నారు. హార్టికల్చర్ విభాగం జిల్లా అధికారిగా ఉన్న జెన్నమ్మనే ఏపీఎంఐసీ ఇన్‌చార్జి పీడీగా ఎప్పటి నుంచో వ్యవహరిస్తున్నారు. జిల్లా పరిశ్రమల అధికారి పోస్టు ఇంకా ఖాళీగానే ఉంది. రేపల్లె, భట్టిప్రోలు, కారంచేడు, బాపట్ల మండలాలకు తహసీల్దార్లుగా ఇన్‌చార్జిలే విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీలో ప్రాధాన్య పోస్టుల్లో శాశ్వత నియామకాలు చేపట్టలేదు. జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న చాలామంది అధికారులు డిప్యూటేషన్‌పైనే విధులు నిర్వహిస్తున్నారు.

1500 పైగా పోస్టులు ఖాళీ..

మార్గదర్శకాల ప్రకారం జిల్లా కార్యాలయాల్లో ఉండాల్సిన నిష్పత్తిలో సిబ్బంది లేరు. ఉన్న అరకొర సిబ్బంది కూడా అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసే వారే ఎక్కువ. జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో 28 మందికి కేవలం 9 మంది మాత్రమే ఉన్నారు. వ్యవసాయశాఖ 15 మంది సిబ్బందితోనే సరిపెట్టుకోవాల్సిన దుస్థితి. గృహ నిర్మాణ, పౌరసరఫరాల శాఖ ఇలా ప్రతి విభాగంలోనూ సిబ్బంది కొరతే. జిల్లాలోని అన్ని శాఖల్లో ఖాళీ చేయాల్సిన పోస్టులు దాదాపు 1500కు పైగానే ఉన్నాయి. మండల కార్యాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బందిని డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌లో విధులు కేటాయించారు. దీంతో ఆయా కార్యాలయాల్లో సరిపడా సిబ్బంది లేక పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. జిల్లాలో వివిధ హోదాల్లో రెవెన్యూ సిబ్బందికి సంబంధించి దాదాపు 200 వరకు ఖాళీలు ఉన్నట్లు సమాచారం.

15 విభాగాలు అద్దె భవనాల్లోనే...

దాదాపు పదిహేను విభాగాల కార్యాలయాలు వేరే వాటి పంచన లేక ప్రైవేటు భవనాల్లోనే ఉన్నాయి. వ్యవసాయ, సహకార, బీసీ కార్పొరేషన్, సమగ్ర శిక్ష అభియాన్, విద్యాశాఖ, ఇంటర్మీడియట్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ కార్యాలయాలు ఓ కళాశాల భవనంలో ఉన్నాయి. దీంతో కళాశాలలో విద్యార్థులకు తరగతులు నిర్వహించుకోవడం సదరు యాజమాన్యానికి ఇబ్బందిగా ఉన్నా సర్దుకుపోవాల్సిన పరిస్థితి. మైనింగ్, అటవీ, ఫుడ్‌సేఫ్టీ విభాగాలతో పాటు మరికొన్ని కార్యాలయాలు ప్రైవేటు భవనాల్లోనే అద్దె ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. జిల్లా ఏర్పడిన దగ్గరనుంచి ఇప్పటి వరకు రెండు మూడు విభాగాలు అయితే పలు చోట్లకు కార్యాలయాలను మార్చుకోవాల్సి వచ్చింది. మున్సిపల్ కార్యాలయభవనంలో కొనసాగుతున్న ఐ అండ్‌పీఆర్ కార్యాలయాన్ని తరలించాలని చెప్పడంతో వేరే భవనం కోసం వారు అన్వేషణ ప్రారంభించారు. సమీకృత కలెక్టరేట్ నిర్మాణం చేపడతామని గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది.అది ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు.


శిథిలమైన భవనంలో కొనసాగుతున్న జిల్లా పంచాయతీ కార్యాలయం

సమస్యలపై జనాన్ని కదిలించాలి

ప్రజలతో సంబంధాలు పెంచుకోవాలి

సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలో బాబూరావు

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు, వర్గసమస్యలపై పోరాటం సాగించి స్థానికంగా జనాన్ని కదలించాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యుడు సి.హెచ్. బాబురావు పిలుపునిచ్చారు. బాపట్లలోని ఎం.ఎస్.ఆర్ కల్యాణ మండపంలో రెండురోజులుగా జరుగుతున్న సీపీఎం బాపట్ల జిల్లా ప్రథమ మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో నిత్య సంబంధాలు పెంచుకోవాలన్నారు. పాలకవర్గాలకు వ్యతిరేకంగా నిలబడి పేద ప్రజలందర్నీ సమీకరించి పోరాటాలు చేసిన చరిత్ర బాపట్ల ప్రాంత కమ్యూనిస్టుయోధులకు ఉందన్నారు. అదానీ, మోదీ కుంభకోణంలో వైసీపీ అధినేత జగన్‌తోపాటు కూటమి నాయకులు కూడా దోషులేనని ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ ఉద్యమాలకు బాపట్ల జిల్లా ఒక రోల్‌మోడల్ కావాలన్నారు. సభకు ముందు పార్టీపతకాన్ని ఆవిష్కరించి, ఏచూరి సీతారాం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రజా నాట్యమండలి కళాకారులు కిరణ్, బొనిగల సుబ్బారావు విప్లవ గీతాలు ఆలపించారు. చిన్నారి బొనిగల ఆద్యశ్రీ భరత నాట్యం ఆలరించింది.

సభలో తీర్మానాలు

కౌలురైతు అభ్యున్నతి కోసం కృషి చేయాలని, కౌలురైతు చట్టం చేయాలని, ఆత్మహత్యలను నివారించాలని, రైతు సమస్యలు, వ్యవసాయసాగు సమస్యలు లేకుండా ప్రభుత్వం తక్షణమే పనిచేయాలని, కార్మిక సమస్యలు పరిష్కారం కోసం లేబర్ కోర్టు, జిల్లా కేంద్రంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి నెలకొల్పాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సి.హెచ్.గంగయ్య, టి.కృష్ణమోహన్, సి.హెచ్.మజుందార్, ఎన్.బాబురావు, సి.హెచ్.మణిలాల్, ఆంజనేయులు, ఝాన్సీ పాల్గొన్నారు.


సీతారాం ఏచూరి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న రమాదేవి, బాబూరావు తదితరులు

రేషన్ దరఖాస్తులు స్వీకరించాలా.. వద్దా?

- గ్రామ, వార్డు సచివాలయాల్లో సందిగ్ధ పరిస్థితి
- ఆదివారం రాత్రికి కూడా జారీ కాని మార్గదర్శకాలు
- ఈ ఏడాది జనవరి నుంచి అర్హుల ఎదురు చూపు

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకారంపై సందిగ్ధత నెలకొన్నది. గత కొన్ని రోజులుగా డిసెంబరు 2వ తేదీ(సోమవారం) నుంచి 28వ తారీఖు వరకు అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో కొత్త రేషన్‌కార్డులు, ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులకి కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించబోతున్నదని, కొత్త డిజైన్లతో రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు విస్తృతంగా ప్రచారం జరిగింది. సంక్రాంతి పండుగకి కొత్తకార్డులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం రాత్రి వరకు మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి జారీ కాలేదు. దీంతో సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరించాలో, లేదో తెలియని పరిస్థితి అధికారుల్లో నెలకొన్నది. ఇంచుమించు 10 నెలలుగా కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులను గ్రామ/వార్డు సచివాలయాల్లో స్వీకరించడం లేదు. ఇందుకు సంబంధించి ఈ-పోస్ సైట్‌ని బ్లాక్ చేశారు. జనవరి, ఫిబ్రవరిలో వచ్చిన దరఖాస్తులు వందల్లో పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారులు తెలిపారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్‌తో రేషన్‌కార్డులకు సంబంధించి ఎలాంటి దరఖాస్తులను స్వీకరించలేదు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడగా వైసీపీ రంగులతో ఉన్న రైస్‌కార్డులను తొలగించాలని నిర్ణయించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన రేషన్‌కార్డుల్లో మొత్తం కుటుంబ సభ్యుల ఫొటో ఉండేది. అలానే కుటుంబ పెద్ద, వృత్తి, పుట్టిన తేదీ, వయస్సు, వార్షికాదాయం వంటి వివరాలు ఉండేవి. గత వైసీపీ ప్రభుత్వం వాటిని తొలగించి రైస్‌కార్డులంటూ సచివాలయాల ద్వారా పంపిణీ చేసింది. ఆ కార్డుల్లో కుటుంబ సభ్యుల ఫొటోని తీసేసి కేవలం ఆ కుటుంబంలో మహిళ ఫొటోని మాత్రమే ఉంచింది. ఆ కార్డులను గుర్తింపు కార్డులుగా పరిగణించలేని పరిస్థితి. కాగా కొత్తకార్డులు, స్ప్లిట్‌కార్డులు, ఇతర సవరణల కోసం పెట్టుకున్న దరఖాస్తులను నిలిపేసింది. ఆరంచెల మూల్యాంకనం ద్వారా వేలల్లో కార్డులను తొలగించింది. ఈ కారణంగా వారు వంట గ్యాస్ సబ్సిడీకి కూడా దూరమయ్యారు. ఇతర సంక్షేమ పథకాలను కూడా పొందలేక పోయారు. గుంటూరు జిల్లాలో ఇప్పటికే 5 లక్షల 99 వేల 511 కుటుంబాలకు రేషన్‌కార్డులున్నాయి. బాపట్ల జిల్లాలో 4 లక్షల 80 వేల 29, పల్నాడు జిల్లాలో 6 లక్షల 45 వేల 110 కుటుంబాలకు రేషన్‌కార్డులున్నాయి. అయితే ఇంకా అర్హులు మిగిలిపోయి ఉండటంతో వారికి కార్డులు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నది. తగిన మార్గదర్శకాలు రాకపోవడంతో సోమవారం నుంచి సచివాలయాలకు దరఖాస్తులతో వచ్చే వారికి ఏమి సమాధానం చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొన్నదని అధికారవర్గాలు తెలిపాయి.

ఎమ్మెల్సీ ఓటు ఉందా.. లేదా?

- సీఈవో ఆంధ్ర వెబ్‌సైట్‌లో తెలుసుకునే సౌలభ్యం
- ఒకవేళ లేకుంటే మళ్లీ క్లెయిమ్ చేసుకునే అవకాశం

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి సంబంధించి త్వరలో జరగనున్న ఎన్నిక కోసం ముసాయిదా ఓటర్ల జాబితాలు అంతర్జాలంలో అందుబాటులోకి వచ్చాయి. ఆరు జిల్లాల నుంచి అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోగా వాటిని క్షేత్ర పరిశీలన జరిపిన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు అన్నీ సవ్యంగా ఉన్న వాటిని ఆమోదించారు. సర్టిఫికెట్లు సరిగా పొందుపరచిన వారి దరఖాస్తులను తిరస్కరించారు. అర్హులకు ఓటుహక్కు కల్పించిన జాబితాలను జిల్లాల వారీగా సీఈవోఆంధ్ర.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న పట్టభద్రుడికి ఓటు మంజూరైందో, లేదో తెలుసుకునే సదుపాయం ఈ వెబ్‌సైట్‌లో కల్పించారు. అర్హత ఉండి ఎవరికైనా ఓటు రాకపోయినా, ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకపోయినా ప్రస్తుతం జరుగుతున్న క్లెయిమ్‌లు/అభ్యంతరాల స్వీకారం సందర్భంగా అందజేయొచ్చని ఈఆర్‌వో ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు.



ఇలా తెలుసుకోచ్చు...

తొలుత సీఈవోఆంధ్ర.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ని వెబ్‌బ్రౌజర్ నుంచి తెరవాలి. అందులో ఎంఎల్‌సీ ఈ రిజిస్ట్రేషన్ -2024లోకి వెళ్లి ట్రాక్ యువర్ అప్లికేషన్ స్టేటస్‌ని మౌస్‌తో క్లిక్ చేయాలి. ఆ వెంటనే మరో విండో ఓపెన్ అవుతుంది. అందులో గ్రాడ్యుయేట్ అనే ఆప్షన్‌ని సెలెక్ట్ చేయాలి. అప్లికేషన్ ఐడీ/ దరఖాస్తుదారుడి పేరు/ ఇంటి నంబరులో ఏదో ఒకటి ఎంపిక చేసుకుని ఆ వివరాలను ఎంటర్ సెర్చ్ వాల్యూలో పొందుపరిచి సెర్చ్‌ని క్లిక్ చేయాలి. ఆ వెంటనే మరో విండో తెరుచుకుని అందులో ఏపీపీ ఐడీ, సబ్మిషన్ డేట్, పీఎస్ నంబరు. ఎస్ఎల్ నంబరు, పేరు, రిలేషన్ నేమ్, హౌస్ నంబరు, ఏఈఆర్‌వో, ఈఆర్‌వో కామెంట్స్, ఏపీపీ స్టేటస్ వివరాలు ప్రత్యక్షమౌ తాయి. అందులో ఏపీపీ స్టేటస్‌లో యాక్సెప్టెడ్ అని ఉంటే మీ ఓటు నమోదైనట్లే. అప్పుడు పీఎస్ నంబరు, సీరియల్ నంబరుని ఒక పేపర్ మీద రాసుకోవాలి. ఆ తర్వాత విండోని మూసేసి హోం పేజీకి వెళ్లి ఎలక్టోరల్ రోల్స్‌లో మెనూ ఏపీ ఎమ్మెల్సీ టీచర్స్, గ్రాడ్యూయేట్ రోల్స్-2024పై మౌస్‌తో క్లిక్ చేయాలి. ఆ వెంటనే మరో విండో తెరుచుకుని ఈస్టు-వెస్టు గోదావరి అండ్ కృష్ణా - గుంటూరు గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాల డ్రాఫ్టు రోల్స్-2024ని ఎంపిక చేసుకుని క్లిక్ చేయాలి. దాంతో మరో విండో తెరుచుకుంటుంది. అందులో సెలెక్ట్ కాన్‌స్టిట్యూయెన్సీ డ్రాప్‌డౌన్ మెనూలో 3 నంబరులో ఉన్న కృష్ణా - గుంటూరుని ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత పక్కనే జిల్లాని ఎంపిక చేసుకోవాలి. అనంతరం గెట్ పోలింగ్ స్టేషన్స్ అనే దానిపై క్లిక్ చేస్తే పోలింగ్ స్టేషన్ నంబరు, పేరు, లోకేషన్ జాబితా తెరుచుకుంటుంది. ఆ తర్వాత ఇంతకుముందు కాగితం మీద రాసుకున్న పోలింగ్‌స్టేషన్‌ని శోధించి వ్యూ మీద క్లిక్ చేస్తే మరో విండో తెరుచుకుని వెరిఫికేషన్ కోడ్‌ని అక్కడ ఉన్నది యథాతథంగా ఎంటర్ చేయమని చెబుతుంది. ఆ కోడ్‌ని ఎంటర్ చేసి సబ్‌మిట్ కొట్టగానే ఓటర్ జాబితా డౌన్‌లోడ్ అవుతుంది. అందులో సీరియల్ నంబరు చూసుకుంటే ఓటు ఉన్నది, లేనిది తెలిసిపోతుంది.

ఓటు లేకపోతే...

"ఒకవేళ ముసాయిదా ఓటర్ జాబితాలో పేరు లేకపోతే మళ్లీ ఓటుహక్కు కోసం క్లెయిమ్ దాఖలు చేసుకోవచ్చు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈ సదుపాయం అందుబాటులో ఉన్నది. డిసెంబరు 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు దాఖలు చేసుకునేందుకు గడువు తేదీ ఉన్నది. ఆ తర్వాత క్లెయిమ్‌లను పరిష్కరించి డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితాని ప్రచురిస్తారు. కాగా ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన పట్టభద్రులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటరుగా నమోదు అయ్యే అవకాశం ఉన్నది.

ఆంధ్రజ్యోతి
నవ్య 6
కుటుంబ కదంబం
సోమవారం • 2 డిసెంబరు 2024

కొబ్బరి నీళ్లు తాగేద్దాం!

కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మంచివని అందరికీ తెలుసు. వేసవికాలంలోనే కాదు చలికాలంలో కూడా తాగవచ్చు. కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరానికి ఎన్నో పోషకాలు, ఖనిజాలు, మినరల్స్ అందుతాయి. చలికాలంలో కొబ్బరి నీళ్లు అందించే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.



చర్మానికి : చలికాలంలో కొబ్బరినీళ్లు తరచూ తాగడం వల్ల శరీరంలో తేమ శాతం పెరుగుతుంది. దీనివల్ల చర్మం పొడారిపోకుండా మృదువుగా ఉంటుంది. ముఖంపై పగుళ్లు, మొటిమలు రాకుండా ఉంటాయి. రాత్రి పడుకునేముందు ముఖాన్ని కొబ్బరి నీళ్లతో కడిగితే మచ్చలు మాయమై చర్మం కాంతివంతంగా మారుతుంది.

రోగనిరోధక శక్తి: కొబ్బరి నీళ్లలో రెబోఫ్లేవిన్, నియాసిన్, థయామిన్, పిరిడాక్సిన్ విటమిన్లతోపాటు యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తితోపాటు ఉత్సాహాన్ని, చురుకుదనాన్ని అందిస్తాయి. చలికాలంలో తరచూ వేధించే అనేక అనారోగ్య సమస్యలను తట్టుకునేందుకు అవసరమైన రోగనిరోధక శక్తిని పెంచుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే సహజ చక్కెరలు, ఎలక్ట్రొలైట్లు శరీరాన్ని ఉత్తేజితం చేసి చలికాలంలో వచ్చే బద్ధకాన్ని పోగొడతాయి.

బరువు : కొబ్బరి నీళ్లలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. పీచు పదార్థాలు, పిండి పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే కొబ్బరి నీళ్లు తాగిన వెంటనే చాలా సమయం వరకు కడుపు నిండిన భావన ఉంటుంది. దీనివల్ల త్వరగా ఆహారం తీసుకోవాలని అనిపించదు. క్రమంగా శరీర బరువు నియంత్రణలోకి వస్తుంది. బరువు తగ్గాలనుకునేవారు ప్రతిరోజూ కొబ్బరినీళ్లు తాగితే మంచి ఫలితం కనిపిస్తుంది.

జీర్ణక్రియ : కొబ్బరినీళ్లు తాగడం వల్ల కడుపులో ప్రేగు కదలికలు సక్రమంగా ఉంటాయి. జీర్ణక్రియ సులభంగా జరుగుతుంది. మలబద్ధకం సమస్య రాదు. కొబ్బరి నీళ్లలోని ఆల్కలీన్ గుణాలు పొట్టలో పీహెచ్ స్థాయిని తటస్థం చేస్తాయి. దీనివల్ల కడుపులో మంట, అజీర్ణం వంటి సమస్యలు రావు. కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది. కొబ్బరి నీళ్లలో ఉండే పొటాషియం శరీరంలోని అదనపు నీటిని, ఇతర వ్యర్థ పదార్థాలను బయటికి పంపుతుంది. రక్తపోటుని నియంత్రిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పకుండా కాపాడుతుంది.

గుండె : తరచూ కొబ్బరి నీళ్లు తాగడం వల్ల రక్త ప్రసరణ వ్యవస్థ అదుపులో ఉంటుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలు తగ్గుతాయి. దీనివల్ల గుండె సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. కొబ్బరి నీళ్లలో ఉండే మెగ్నీషియం శరీరంలో ఇన్సులిన్ పనితీరుని మెరుగుపరుస్తుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది.

శక్తి : చలికాలంలో వ్యాయామం చేసిన తరవాత లేదంటే ఆటలు ఆడిన తరవాత శరీరానికి నిస్సత్తువ ఆవరిస్తుంది. ఇటువంటి సమయంలో వెంటనే కొబ్బరి నీళ్లు తాగితే శారీరక శ్రమ నుంచి ఉపశమనం లభిస్తుంది. కొబ్బరి నీళ్లలో ఉండే ఎలక్ట్రొలైట్లు, ఖనిజ లవణాలు తక్షణ శక్తిని అందిస్తాయి.

సి విటమిన్ లోపిస్తే...



విటమిన్ 'సి' మన ఆరోగ్యానికి అత్యవసరమైన పోషకం. రోగనిరోధక శక్తిని పెంచడంలో దీని పాత్ర కీలకం. గుండె, చర్మం, ఎముకలు, కండరాలు, దంతాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మన శరీరంలో విటమిన్ 'సి' లోపిస్తే వచ్చే అనారోగ్య సమస్యల గురించి తెలుసుకుందాం.

రక్తహీనత : మనం తీసుకునే ఆహారపదార్థాల నుంచి ముఖ్యంగా శాకాహారం నుంచి ఐరన్‌ను గ్రహించడంలో శరీరానికి సి విటమిన్ సహాయం తప్పనిసరి. విటమిన్ సి తగిన పరిమాణంలో లేని పక్షంలో శరీరానికి ఐరన్ అందక రక్తం ఉత్పత్తి కాదు. దీంతో రక్తహీనత సమస్య వస్తుంది. శాకాహారుల్లో ఈ సమస్య అధికంగా ఉంటుంది.

అంటువ్యాధులు : సి విటమిన్ లోపించడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఫలితంగా పలు రకాల అంటువ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది. జలుబు, దగ్గు, జ్వరం, న్యుమోనియా వంటివి తరచూ వేధిస్తుంటాయి.

ఎముకలు విరగడం : ఎముకలు బలంగా ఉండేందుకు కావాల్సిన కాల్షియాన్ని శరీరం సంగ్రహించేందుకు సి విటమిన్ తోడ్పడుతుంది. దీని లోపం వల్ల శరీరం కాల్షియాన్ని శోషించుకోలేదు. ఫలితంగా ఎముకలు బలహీనమై ఆస్టియోపోరోసిస్ అనే వ్యాధి వస్తుంది. చిన్నపాటి ప్రమాద సంఘటనలకే ఎముకలు విరిగిపోతుంటాయి. గోళ్లు పెళుసుగా మారతాయి.

కండరాలు బలహీనం : సి విటమిన్ లోపిస్తే శరీరంలో 'కొల్లాజెన్' అనే ప్రోటీన్ ఉత్పత్తి కాదు. దీంతో కండరాలు, ఎముకల మధ్య అనుసంధానం దెబ్బతింటుంది. రక్తనాళాల గోడలు బలహీనమై కండరాల్లో వాపుని నొప్పిని కలిగిస్తాయి. గాయాలు తొందరగా నయం కావు.

దృష్టి దోషాలు : శరీరానికి సి విటమిన్ అందకపోతే తొందరగా వార్ధక్య లక్షణాలు ఎదురవుతాయి. కంటిచూపును అందించే రెటీనాలో ప్రధాన భాగమైన మాక్యులాలో అసాధారణ స్రావాలు విడుదలవుతాయి. దీంతో మాక్యులా పొరలు ఉబ్బి కంటి చూపు మందగిస్తుంది. రంగులను గుర్తించడం కష్టమవుతుంది.

అలసట: సి విటమిన్ లోపం కారణంగా శరీరంలో శక్తి ఉత్పత్తి వ్యవస్థ దెబ్బతింటుంది. దీంతో శరీరానికి కావాల్సిన శక్తి లభించక ఎప్పుడూ నీరసంగా, బలహీనంగా అనిపిస్తుంది. ఎంత బలమైన ఆహారం తీసుకున్నప్పటికీ అలసటగా, మత్తుగా అనిపిస్తుంది. ఏకాగ్రత కుదరక మానసిక సమస్యలు ఏర్పడతాయి.

నోటి సమస్యలు: విటమిన్ సి లోపం వల్ల దంతాలు, చిగుళ్లు బలహీనమవుతాయి. డెంటిన్ అనే పదార్థం ఏర్పడక పోవడంతో దంతాల్లోని రక్తనాళాలు పెళుసుగా మారతాయి. పళ్లు తోముతున్నపుడు కలిగే చిన్నపాటి ఒత్తిడికే రక్తనాళాలు చిట్లి చిగుళ్ల నుంచి రక్తం స్రవిస్తుంది. చిగుళ్లలో వాపు, నొప్పి కూడా బాధిస్తుంటాయి.

కళ

సినీ కుటుంబ నేపథ్యం. కానీ పరిశ్రమ వైపు వెళ్లలేదు. సంగీత సాగరంలో తనకంటూ కొన్ని తీపి గుర్తులు ఉండాలనే తాపత్రయం. అందుకే మూడు దశాబ్దాలుగా స్వర సంగమంలో మునిగిపోయారు. వేదికలెక్కి... వేల ప్రదర్శనలు ఇచ్చి... ప్రతిష్ఠాత్మక 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం' అందుకున్నారు. అలనాటి ప్రముఖ నటుడు 'రక్తకన్నీరు' నాగభూషణం మనవరాలు... కర్ణాటక సంగీత కళాకారిణి... శ్వేతా ప్రసాద్‌తో 'నవ్య' ముచ్చట్లు.



సుస్వర సంగీత ఝురి

"ఒకరి పేరు చెప్పుకొని కాదు... మనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలనేది నా అభిమతం. అందుకు నేను ఎంచుకున్న మార్గం సంగీతం. మూడేళ్లప్పుడు మొదలుపెట్టాను. మూడు దశాబ్దాలుగా పాడుతూనే ఉన్నాను. సరిగమల ప్రవాహంలో సాగిపోతున్నాను. దానికి ప్రతిఫలమే ఇటీవల నేను అందుకున్న 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం'. నాకు 2022 సంవత్సరానికి గానూ కర్ణాటక సంగీతంలో వచ్చింది. ఢిల్లీలో 'కేంద్ర సంగీత నాటక అకాడమీ' ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. యువ కళాకారులకు ఇది 'పద్మశ్రీ'తో సమానం. స్వయంకృషితో ఎదిగి, ఇంతటి ప్రతిష్ఠాత్మక పురస్కారం తీసుకోవడం సంతోషంగా ఉంది. ఎంతో గర్వంగా అనిపిస్తోంది.

సంగీత జ్ఞానం ఉన్నవారే...

సంగీతాభిరుచి నాకు మా నాయనమ్మ శశిరేఖ నుంచి వచ్చింది. ఆవిడ కర్ణాటక సంగీతం చాలా బాగా ఆలపిస్తారు. మా తాత నాగభూషణం గారి 'రక్తకన్నీరు' నాటకానికి చాలా ఏళ్లు నాయనమ్మే పాడేవారట. నాన్న రవీంద్రనాథ్‌ది మేనరికం. మా అమ్మ ప్రసన్నకు మేనత్తే మా నాయనమ్మ. అమ్మ వైపు అందరికీ సంగీతంలో ప్రవేశం ఉంది. ఒకరు వయోలిన్ వాయించేవాళ్లు. ఒకరు హార్మోనియం... మరొకరు గాత్రం. కాకపోతే ఎవరూ ఎక్కడా నేర్చుకోలేదు. అలా నాకూ నాయనమ్మ వారసత్వం వచ్చింది. నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. సంగీతంలో రామలక్ష్మి రంగాచారి గారు నా తొలి గురువు. ఐదారేళ్ల తరువాత నేతి శ్రీరామ్ గారి వద్ద శిష్యరికం చేశాను. మొత్తం పదహారేళ్లపాటు సంగీతం నేర్చుకున్నాను. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీకాం తరువాత ఎంఏ మ్యూజిక్ చదివాను. ప్రస్తుతం కర్ణాటక సంగీతంలో ఎంఫిల్ చేస్తున్నాను.

పిలిచి పాడించేవారు...

పదో ఏట నుంచే కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలకు పాడేదాన్ని. మా తాతగారిని కలవడానికి పెద్ద పెద్ద నటులు, నాయకులు ఇంటికి వచ్చేవారు. నన్ను పిలిచి... 'ఇది నా మనవరాలు. బ్రహ్మాండంగా పాడుతుంది... వినండి' అని నాతో వాళ్ల ముందు పాడించేవారు. ఎక్కువగా కమ్యూనిస్టు పాటలు పాడమనేవారు. నాయనమ్మకు పక్షవాతం వచ్చి పన్నెండేళ్లు మంచం మీదే ఉన్నారు. అప్పట్లో తను సొంతంగా రాసుకున్న గీతాలు నేను పాడి వినిపిస్తుంటే ఎంతో ఉద్వేగానికి లోనయ్యేవారు. తాత కూడా కన్నీళ్లు పెట్టుకొనేవారు.

ఆ ఇద్దరూ భలే ఇష్టం...

తాత గారికి ఐదుగురు సంతానం. ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. ఇక మా ఇంట్లో నేనే పెద్దదాన్ని. తమ్ముడు కౌశిక్ హోటల్ మేనేజ్‌మెంట్ చదివి, అదే రంగంలో స్థిరపడ్డాడు. చిన్నప్పుడు తాతయ్య మాతో చాలా సరదాగా గడిపేవారు. మా మధ్య చాలా సంభాషణలు జరిగేవి. 'రోజూ మేకప్ వేసుకొని తీయాలంటే చికాగ్గా ఉండదా' అని అడిగితే... 'అవునే..! మేకప్ కోసం తెల్లవారుజాము మూడింటికి లేచేవాడిని. మంచం మీద పడుకొంటే ముఖానికి రంగు వేసేసేవాళ్లు' అనేవారు నవ్వుతూ. నచ్చిన నటులు ఎవరని అడిగేవాళ్లం. ఆయన ఎప్పుడూ జయప్రద గారి గురించి గొప్పగా చెప్పేవారు. 'ఏంటోనే... ఆ అమ్మాయిని చూస్తుంటే అమ్మవారిలా అనిపిస్తుంది. ఏం అందం ఆ అమ్మాయిది' అనేవారు. ఆవిడ కూడా తాతయ్యను ఆప్యాయంగా 'డాడీ' అని పిలిచేవారు. అలాగే సూర్యకాంతం గారి వ్యక్తిత్వం ఆయనకు బాగా నచ్చేది. ఇద్దరూ 'ఒరేయ్ అన్నయ్యా' అంటే 'ఒరేయ్ అన్నయ్యా' అని పిలుచుకొనేవారట. ఆవిడ మహా సరదా మనిషట. షూటింగ్‌లో కాస్త ఖాళీ దొరికితే చాలు... 'ఒరేయ్ అన్నయ్యా... రా ఆడుకొందాం' అని ఎడం చేత్తో పేక ముక్కలు అలా వేసిపడేసేవారట. ఫ్రీగా ఆడమంటే అస్సలు ఒప్పుకొనేవారు కాదుట. డబ్బులకు తప్ప ఆడేవారు కాదుట. ఇంట్లో అందరికీ వండి పెట్టడమంటే సూర్యకాంతం గారికి మహా ఇష్టమని చెప్పేవారు తాతయ్య.

ఎందుకో ఒప్పుకోలేదు...

నేను ఎనిమిదో తరగతిలో ఉండగా మా తాత చనిపోయారు. ఎందుకో తెలియదు... ఆయన తన పిల్లలు ఎవర్నీ సినిమాల్లోకి రానీయలేదు. నేను పుట్టేనాటికి... అంటే 1983కు ముందే పరిశ్రమతో సంబంధాలు తెంచుకుని హైదరాబాద్‌కు వచ్చేశారు. మా నాన్న కోసం దాసరి నారాయణరావు తదితరులు బోల్డెన్ని కథలు రాసుకున్నారు. 'రవిబాబు కోసం నేను ఈ కథ రాసుకున్నా. బాబును నాకు వదిలెయ్... ఐదేళ్లలో సూపర్‌స్టార్‌ను చేస్తా' అనేవారు దాసరి. నాన్నది మంచి పర్సనాలిటీ. చూడ్డానికి చాలా బాగుంటారు. అయితే తాత గారు ససేమిరా అన్నారు. 'ఏమైనా చెప్పండి. అటువైపు నా పిల్లలను పంపించను' అని తెగేసి చెప్పేవారట. నేను కూడా కీరవాణి, కోటి, మణిశర్మ గార్ల సినిమాలకు పదేళ్లపాటు కోరస్ పాడాను. అదికూడా తాతకు నచ్చేది కాదు. 'ఎందుకు పంపిస్తున్నావురా పిల్లని' అని నాన్నపై కోప్పడేవారు. నలభై ఏళ్లకు పైగా పరిశ్రమలో ఉన్న ఆయన అంత కచ్చితంగా చెబుతున్నారంటే ఆలోచించాలి కదా!

వేల ప్రదర్శనలు...

ప్రస్తుతం నాకు, మావారు రేణుకా ప్రసాద్‌కు సంగీతమే వృత్తి. ఇదే మా జీవితం. ఆయన మృదంగం వాయిస్తారు. నట్టువాంగం చేస్తారు.



> **అమ్మవల్లే ఇక్కడివరకు...**
>
> సంగీతంలో నేను ఈ స్థాయికి రావడానికి మా అమ్మే కారణం. చిన్నప్పుడు సంగీత తరగతులకు వెళ్లనని ఏడ్చేదాన్ని. అయినా అమ్మ వినేది కాదు. 'నీకు భగవంతుడు మంచి గొంతు ఇచ్చాడు. నువ్వు ఏమైనా చెయ్యి. క్లాస్‌కు వెళ్లాల్సిందే' అనేది. ఎక్కడ పోటీలున్నా వెంటబెట్టుకుని తీసుకువెళ్లేది. నేను సంగీతం నేర్చుకోవడానికి ఏంకావాలన్నా చేసేది. పెళ్లయ్యాక మావారు, అత్తగారు కూడా అంతే ప్రోత్సహించారు. అమ్మ ప్రేరణ, అత్తింటివారి సహకారంవల్లే ఇదంతా సాధ్యమైంది.

తాతగారి కోసం రాస్తే...

'ముత్యాలముగ్గు'లో రావుగోపాలరావు గారు పోషించిన పాత్రను వాస్తవానికి బాపూ గారు తాతయ్య కోసం రాసుకున్నారు. ఎంత అడిగినా 'నేను చేయాలనుకోవడంలేదు' అని తాత చెప్పేశారు. సినిమాలు వదిలేసినప్పుడు చెన్నైలో ఆస్తులన్నీ అమ్మేసుకుని ఇక్కడ చిన్న ఇల్లు కొనుక్కుని స్థిరపడ్డారు. ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో ఇప్పటికీ ఆయన పిల్లలు ఎవరికీ తెలియదు. ప్రస్తుతం మాకు పరిశ్రమలో ఎవరితో సంబంధాలు లేవు. అయితే జూనియర్ ఎన్టీఆర్ నాకు కజిన్ అవుతాడు. వాళ్లమ్మ శాలిని గారు, మా అమ్మ కజిన్ సిస్టర్స్. చిన్నప్పుడు తారక్ కూచిపూడి నాట్యానికి నేను గాత్ర సహకారం అందించేదాన్ని. ఇప్పుడు అతను బాగా బిజీ అయిపోయాడు. వాళ్లమ్మకు, మా అమ్మకు ఇప్పటికీ ఎంతో సాన్నిహిత్యం ఉంది. అలాగే బాలు గారితో మా నాన్నకు మంచి స్నేహం. ఇద్దరూ చెన్నైలో పక్క ఇళ్లల్లో ఉండేవారు.



మాకు ఒకతే అమ్మాయి... ప్రసిద్ధ. ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. వయోలిన్ బ్రహ్మాండంగా వాయిస్తుంది. నేను, మావారు ఇప్పటికి మూడు వేల ప్రదర్శనల వరకు ఇచ్చివుంటాం. ఏటా అమెరికా వెళతాం. కచేరీలు, గెస్ట్ లెక్చరర్స్ ఇస్తాం. సంగీత తరగతులు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాం. శోభానాయుడు గారికి పాతికేళ్లు పాడాను. ఆనంద్ శంకర్, స్వప్నసుందరి తదితర ప్రముఖ నాట్యకారులందరికీ నేనే పాడుతున్నాను. ఇవికాకుండా ఎన్నో కచేరీలు చేశాను. తమన్ గారు అడిగితే 'సర్కారువారి పాట' చిత్రంలోని 'కళావతి' పాటలో జతులు ఆలపించాను. నాని 'అంటే సుందరానికి' చిత్రం 'పంచె కట్టు' పాట తమిళం, మళయాళం వెర్షన్లు పాడాను. ఇంతకుమించి సినిమా పాటలు పాడలేదు.

పెద్దగా కోరికలు లేవు...

కొవిడ్ సమయంలో సంపాదన లేక కొన్ని రోజులు ఇబ్బంది పడినా... అమ్మవారి దయవల్ల మా జీవితం ఇప్పుడు సంతోషంగా సాగిపోతోంది. మాది పదహారు మంది ఉన్న ఉమ్మడి కుటుంబం. కోట్లు సంపాదించాలి... బెంజిలో తిరగాలనే కోరికలేవీ మాకు లేవు. ముప్పై ఏళ్లుగా పాడుతున్నాం. వచ్చిన డబ్బుతో ఇల్లు కొనుక్కున్నాం. కారు ఉంది. ఇబ్బందులు లేకుండా సంసారం సాగిపోవడానికి సరిపడా సంపాదన వస్తోంది. ఒక మనిషి ఆనందంగా జీవించడానికి ఇంతకంటే ఏంకావాలి! చుట్టూ మన అనుకొనే మనుషులు... నాలుగు కచేరీలు ఉంటే చాలు మాకు."

• హనుమా

కాలేయాన్ని కాపాడుకుందాం!

కాలేయం మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. శరీరంలో చేరిన విష పదార్థాలను, ఇతర వ్యర్థాలను తొలగించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఏదైనా సమస్య వచ్చినపుడు కాలేయం తనంతట తాను మరమ్మతు చేసుకుంటుంది. మనం తీసుకునే కొన్ని ఆహార పదార్థాలు కూడా ఇందుకు సహకరిస్తాయి. వాటి గురించి తెలుసుకుందాం.

వెల్లుల్లి

- ఇందులో సల్ఫర్‌తోపాటు అల్లిసిన్, సిలీనియం లాంటి రసాయన సమ్మేళనాలు ఉంటాయి. శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపేందుకు కాలేయంలో ఉత్పత్తయ్యే ఎంజైముల తయారీకి ఇవి తోడ్పడతాయి. వెల్లుల్లిని ఆహార పదార్థాల్లో చేర్చుకోవడం ద్వారా కాలేయం పనితీరు మెరుగుపడుతుంది.

బీట్‌రూట్

- తరచూ బీట్‌రూట్ రసం తీసుకోవడం వల్ల అందులోని బీటాలైన్ సమ్మేళనాలు కాలేయంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. బీట్‌రూట్‌లో ఉండే పలు నైట్రేట్‌లు కాలేయంలో వ్యర్థాలు పేరుకోకుండా చేస్తాయి.

గ్రీన్ టీ

- తరచూ గ్రీన్ టీ తాగడం వల్ల కాలేయంలో ఎంజైమ్‌ల ఉత్పత్తి నియంత్రణలో ఉంటుంది. గ్రీన్ టీలోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలోని వ్యర్థాలను కరిగించి మూత్రం ద్వారా బయటికి వెళ్లేలా చేస్తాయి.

ఆకు కూరలు


- ఆకు కూరల్లో క్లోరోఫిల్ అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో చేరిన భార ఖనిజాలు, పురుగు మందుల అవశేషాలు, ఇతర రసాయనాలను తొలగించడంలో కాలేయానికి సహాయం చేస్తుంది. ఆకుకూరలు, ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే కూరగాయలను తరచూ తినడం వల్ల కాలేయంపై పని భారం తగ్గుతుంది.

ఆలివ్ ఆయిల్

- దీనిలో ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరంలో చేరిన కొన్ని రకాల విష పదార్థాలను శోషించుకుంటాయి. ప్రతిరోజూ తినే ఆహార పదార్థాల్లో ఆలివ్ ఆయిల్‌ను చేర్చుకోవడం వల్ల కాలేయంపై పని ఒత్తిడి తగ్గుతుంది.

ధనియాలు

- ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా ధనియాలు వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే పరగడుపున తాగితే కాలేయంలో వ్యర్థాలు మిగలకుండా ఉంటాయి.



ధనియాల్లో ఉండే పీచు పదార్థాలు, ఫోలిక్ యాసిడ్‌లు ప్రభావవంతంగా పనిచేసి కాలేయాన్ని శుభ్రపరుస్తాయి.

వాల్‌నట్స్

- వీటిలో ఒమేగా 6, ఒమేగా 3 ఫాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి కాలేయంలో కొవ్వులు పేరుకోకుండా చేస్తాయి. వాల్‌నట్స్ తినడం వల్ల వాటిలోని అర్జినైన్ అనే అమైనో ఆమ్లం శరీరం నుంచి అమ్మోనియాను తొలగించడంలో కాలేయానికి సహకరిస్తుంది.

బాదం


- బాదం పప్పులో ఇ విటమిన్ ఉంటుంది. ఇది కాలేయంలోని ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడుతుంది. కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ కనీసం అయిదు బాదం పప్పులను నీటిలో నానబెట్టి తినాలి.

పండ్లు

- నిమ్మ, నారింజ, బత్తాయి లాంటి సిట్రస్ పండ్లను తరచూ తినడం వల్ల శరీరానికి పుష్కలంగా సి విటమిన్ అందుతుంది. ఇది శరీరంలో చేరిన వ్యర్థాలను పూర్తిగా తొలగించి కాలేయానికి విశ్రాంతిని ఇస్తుంది. యాపిల్ పండ్లను తినడం వల్ల వాటిలో ఉండే పెక్టిన్ అనే పీచు పదార్థం కాలేయాన్ని పూర్తిగా శుభ్రం చేస్తుంది. నల్ల ద్రాక్షను జ్యూస్‌లా చేసుకుని తాగితే అందులోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలో ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గిస్తాయి.

ఈ సినిమా ఆ లోటు తీరుస్తుంది

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఘంటసాల ది గ్రేట్'. కృష్ణ చైతన్య టైటిల్ రోల్ పోషిస్తున్నారు. సిహెచ్. రామారావు దర్శకత్వంలో సిహెచ్.ఫణి నిర్మించారు. తాజాగా, ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ "ఈతరం ఘంటసాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. అందరూ ఆయన్ని శతాబ్ది గాయకుడు అంటారు. నేను ఆయన్ని అమర గాయకుడు అంటాను. సంగీతం ఉన్నంత కాలం ఆయన ప్రజల మనసుల్లో ఉంటారు. కృషితో నాస్తి దుర్భిక్షం, వినయంతో విద్య ప్రకాశిస్తుందని చెప్పడానికి నిలువెత్తు నిదర్శనం ఆయన. దేశంలో ఇప్పటివరకూ ఏ గాయకుడి మీద పూర్తి స్థాయి సినిమా రాలేదు. ఈ సినిమా ఆ లోటును తీరుస్తుంది" అని అన్నారు.

మార్చిలో మొదలు



మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. యువీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీస్థాయిలో నిర్మిస్తున్నాయి. ఈ సినిమా షూటింగ్‌పై ఆదివారం మేకర్స్ నుంచి అప్డేట్ వచ్చింది. 'మేర్లపాక గాంధీ అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు, వరుణ్ తేజ్ పాత్ర సరికొత్తగా ఉండబోతోంది. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది, వచ్చే ఏడాది మార్చిలో చిత్రీకరణ ప్రారంభిస్తామ'ని తెలిపారు.

తుదిదశలో చిత్రీకరణ




ప్రభాస్ కథానాయకుడిగా మారుతి రూపొందిస్తున్న హారర్ థ్రిల్లర్ 'రాజా సాబ్'. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. మాళవికా మోహనన్ కథానాయికగా నటిస్తున్నారు. ఓ ఇంటర్వ్యూలో మాళవిక 'రాజాసాబ్' షూటింగ్ గురించి ఆసక్తికర అంశాలను పంచుకున్నారు. "రాజాసాబ్ షూటింగ్ తుది దశకు చేరుకుంది. మంచి ప్లానింగ్‌తో మారుతి షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఆయన త్వరలోనే ఆశ్చర్యపోయే అప్‌డేట్ ఇవ్వబోతున్నారు' అన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. టీజీ విశ్వ ప్రసాద్, వివేక్ కూచిబొట్ల నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.

మహేశ్‌బాబు ఎంజాయ్ చేశారు



2019లో వచ్చిన 'ది లయన్ కింగ్' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న చిత్రం 'ముఫాసా: ది లయన్ కింగ్'. బారీ జెన్‌కిన్స్ దర్శకత్వం వహించారు. వాల్ట్ డిస్నీ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసా పాత్రకు హీరో మహేశ్‌బాబు డబ్బింగ్ చెప్పారు. ఆదివారం చిత్రబృందం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ముఫాసా, మహేశ్‌బాబు ప్రచార చిత్రాన్ని నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'డిస్నీ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన చిత్రమిది. ఇలాంటి మంచి సినిమాను ఔచిత్యం చెడకుండా డబ్ చేయడం ఓ సవాల్ అనే చెప్పాలి. డిస్నీ సంస్థ చాలా శ్రమించి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. చాలా ఎంజాయ్ చేస్తూ 'ముఫాసా' పాత్రకు మహేశ్‌బాబు డబ్బింగ్ చెప్పారు. ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. ఈ సందర్భంగా ముఫాసా చిత్రబృందం రూపొందించిన మహేశ్‌బాబు పోస్టర్‌ను నమ్రత ఆవిష్కరించారు. సత్యదేవ్, అలీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



అద్భుత ప్రయాణం ముగిసింది

మలయాళ కథానాయకుడు మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'లూసిఫర్ 2: ఎంపురన్'. 2019లో విడుదలై ఘనవిజయం సాధించిన 'లూసిఫర్' సినిమాకు ఇది కొనసాగింపు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. తాజాగా, ఈ సినిమా షూట్ పూర్తైనట్లు మోహన్‌లాల్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలిపారు. "లూసిఫర్ సినిమా షూట్ పూర్తైంది. 14 నెలలుగా ఎనిమిది రాష్ట్రాలు.. యూఎస్ఏ.. యూకే.. యూఏఈలోని అద్భుతమైన లోకేషన్లలో చిత్రీకరించాం. అద్భుత ప్రయాణమిది. ప్రతి ఫ్రేమ్‌ని తన సృజనాత్మకతతో మరో స్థాయికి తీసుకెళ్ళే అపార ప్రతిభ పృథ్వీరాజ్ సొంతం. తన కలం పదునుతో సినిమాకు ఎంతో ప్రత్యేకతను తెచ్చిన మురళీ గోపికి.. ఈ ప్రాజెక్ట్‌పై ఎంతో నమ్మకం పెట్టిన నిర్మాతలకు ధన్యవాదాలు. టీమ్ సమష్టి కృషి వల్లే ఈ సినిమా సాధ్యమైంది. నా సినీ ప్రయాణంలో ఈ సినిమా ఓ మైలురాయి. అభిమానులు అందించే ప్రేమే మాలో స్ఫూర్తిని పెంచింది" అని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమా విడుదలవుతోంది.

ఎక్స్ ఖాతా డిలీట్



నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోన్న 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్' డాక్యుమెంటరీ విషయంలో ధనుష్, నయనతార మధ్య మొదలైన వివాదం తెలిసిందే. 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని కొన్ని సెకన్ల ఫుటేజిని వాడారని.. అందుకోసం ధనుష్.. నయనతార, విఘ్నేష్ శివన్ కోర్టు నోటీసులు పంపారు. అయితే, ఇటీవలే 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని క్లిప్ ఉచితంగా చూసేయ్యండి అనే వీడియోతో పాటు ధనుష్ ఓ మీడియా ఈవెంట్‌లో మాట్లాడిన వీడియోనూ ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ చేశారు విఘ్నేశ్. ధనుష్ అభిమానుల నుంచి ట్రోలింగ్ జరిగేసరికి ధనుశ్ వీడియోను తొలగించారు. తాజాగా, తాను అజిత్ నటించిన 'ఎన్నై అరిందాల్' (ఎంతవాడు కానీ) సినిమా కోసం ఓ పాట రాశాననీ.. అదే టైమ్‌లో తన మొదటి మూవీ 'నానుమ్ రౌడీ దాన్'ని చూసి ఆయన మెచ్చుకున్నారని తెలిపారు. ఇవన్నీ అబద్దాలంటూ.. అజిత్ సినిమా రిలీజైన ఏడు నెలలకు 'నానుమ్ రౌడీ దాన్' విడుదలైందని.. అసలు థియేటర్లలోకి సినిమా రాకముందే అజిత్ ఎలా చూశారని ధనుశ్ అభిమానులు విఘ్నేష్‌ను ట్రోల్ చేశారు. దీంతో విఘ్నేష్ శివన్ తన ఎక్స్ ఖాతాను డిలీట్ చేశారు.

రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలి


ర్యాలీ చేస్తున్న ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గుంటూరు(విద్య), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్, వేధింపులతో మరణించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్కిటెక్చర్ విద్యార్థిని రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, హైకోర్టులోప్రభుత్వమే అప్పీల్ దాఖలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. రిషితేశ్వరికి న్యాయం చేయాలని కోరుతూ నగరంలో ఆదివారం బ్రాడీపేట ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయం నుంచి శంకర్‌విలాస్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ మాట్లాడుతూ రిషితేశ్వరి ర్యాగింగ్ తట్టుకోలేక హాస్టల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడిందని, సూసైడ్ నోట్ ఆత్మహత్యకు గల కారణాలు స్పష్టంగా పేర్కొన్నా న్యాయం జరగకపోవడం దారుణమన్నారు. సీనియర్ విద్యార్థుల వేధింపులు, వర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే రిషితేశ్వరి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. తొమ్మిది సంవత్సరాలపాటు న్యాయంస్థానంలో విచారణ జరిగినా బాధితులకు న్యాయం జరగలేదన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు అనూరాధ, స్వాతి, బాష, రమణ, పద్మ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, ఎస్‌కే సమీర్, నగర అధ్యక్షుడు యశ్వంత్, సురేంద్ర, సుభాని, షంపీర్, శివాజీ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం


రెడ్డిపాలెంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఫాదర్ జాకోబ్‌రెడ్డి

బొల్లాపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో పునీత ఫ్రాన్సిస్ శౌరి వారి మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. దీనిలో భాగంగా రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను రెవరెండ్ ఫాదర్ యన్నం జాకోబ్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.20,116 శ్రీ చక్రసిమెంట్ వారి సహకారంతో, ద్వితీయ బహుమతి రూ.15,116 శివ శక్తి లీలా అంజన్ ఫౌండేషన్ సహకారంతో, ద్వితీయ బహుమతి రూ.12,116 అవుకు శివ ప్రసాదు బయో వింజన్ ఫార్మా కంపెనీ సౌజన్యంతో, నాలుగో బహుమతి రూ.7,116 రెడ్డిపాలెం ఎంప్లాయిస్ యూనియన్ వారి సహకారంతో జరుగుతుందన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ క్రీడా పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నాగార్జున కొండపై పర్యాటకుల సందడి


కొండను సందర్శించి వస్తున్న పర్యాటకులు

మాచర్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండపై ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీలలో కొండకు చేరుకున్న పర్యాటకులు మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతిపనిముట్లు, బుద్ధుని పాలరాతి విగ్రహం, మట్టి కుండలు, బోధివృక్షం సందర్శించారు. అనుపులోని యాంఫీ థియేటర్ అశ్వమేధ యజ్ఞశాల, శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని వీక్షించారు. అనంతరం ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. దీంతో లాంచీ స్టేషన్‌కు రూ. 48 వేల ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ కౌన్సిలర్ మృతి


మృతుడు చిన్న నరసింహారావు (ఫైల్)

రాజుపాలెం, పిడుగురాళ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో టీడీపీ మాజీ కౌన్సిలర్ మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పిడుగురాళ్ల పట్టణంలోని లెనిన్ నగర్‌కు చెందిన చిలక చిన్న నరసింహారావు(57) పిడుగురాళ్ల నుంచి కొండమోడు జంక్షన్‌లోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఆ సమయంలో గుంటూరు వైపు నుంచి పిడుగురాళ్ల వైపు వస్తున్న లారీ అతి వేగంతో వస్తూ ఢీకొట్టింది. ఈ సంఘటనలో చిలక చిన్న నరసింహారావుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం పిడుగురాళ్లకు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిలక చిన్న నరసింహారావు 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్‌గా కొనసాగారు.

వైభవంగా వీరారాధన ఉత్సవాలు

- పల్నాటి యుద్ధంపై కథాగానం
- ఘనంగా గ్రామోత్సవం
- ఆయుధాలను తిలకించిన ప్రజాప్రతినిధులు


ప్రథమ స్థానం సాధించిన బాపట్ల జిల్లా ఎడ్లజత

కారంపూడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాచర్ల రాజులు అలరాజును రాయబారిగా గురజాలకు పంపడం, అది సహించని నాగమ్మ చర్లగుడిపాడు వద్ద అలరాజుపై విషప్రయోగం చేయించి హతమార్చి పల్నాటి యుద్ధంకు శ్రీకారం చుట్టింది. ఈ సంఘటనను కథాగానం చేశారు. వీరారాధన ఉత్సవాలు రెండో రోజైన ఆదివారం కొనసాగాయి. వీరాచారవంతులు ఆనాటి ఆయుధాలకు గంగధార మడుగులో స్నానమాచరింపజేసి వాటిని అలంకరించి నూతన వస్త్రాలు ధరింపజేసి పొంగళ్ల వండి నైవేద్యం సమర్పించారు. అనంతరం గ్రామోత్సవం జరిపారు. వీర్ల దేవాలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు చెన్నకేశవస్వామి ఆలయం, బ్రహ్మనాయుడు విగ్రహం, అంకాళమ్మ ఆలయం చోట్ల కత్తిసేవ చేసి పీఠాధిపతి ఇంటి వద్ద ప్రదర్శన నిర్వహించారు. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ ఆవేశంతో ఊగిపోతున్న వీరాచారవంతులకు తీర్థమిచ్చి శాంతింపజేశారు. పీఠాధిపతి వీర్లదేవాలయంలోని మండపంలో ఆశీనులు కాగా వీరవిద్యావంతులు రాయబారం ఘట్టాన్ని గానం చేశారు.

ప్రత్యేక పూజల్లో ఎంపీ, ఎమ్మెల్యే

నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, పిడుగురాళ్ల పట్టణ ప్రముఖ వైద్యుడు, టీడీపీ నేత ఉన్నం మల్లికార్జునరావు స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ముందుగా వీరుల దేవాలయంలో వీరుల ఆయుధాలను ఆసక్తిగా తిలకించారు. కన్నమదాసు భైరవఖడ్గాన్ని చేతబూనారు. అలాగే చెన్నకేశవస్వామి, అంకాళమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా కూటమి నేతలు భారీ ర్యాలీతో వారికి ఘనస్వాగతం పలికారు.

బాపట్ల జిల్లా ఎడ్లజత ప్రథమం

కారంపూడి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకుని స్థానికంగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీల్లో ఆదివారం సేద్యపు విభాగం పోటీలు జరిపారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా, సంతమాగులూరుకు చెందిన వజ్రాల తేజశ్రీ ఎడ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 4200 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్‌కు చెందిన రోహన్ బాబు ఎడ్లజత 4159.8 అడుగులతో రెండోస్థానం, గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, కొప్పురావూరుకు చెందిన తోట శ్రీనివాసరావు, తెలంగాణ జిల్లా మేళ్ల చెరువుకు చెందిన కొప్పుల గోవర్ధన్‌రెడ్డి, ప్రవలేష్‌రెడ్డి సంయుక్త ఎడ్లజత 4053.6 అడుగులతో మూడోస్థానంలో నిలిచాయి. అనంతరం విజేత ఎడ్లజతల యజమానులకు బహుమతులు అందజేశారు. సోమవారం సబ్ జూనియర్స్ విభాగంలో ఎడ్ల పోటీలు నిర్వహించనున్నట్లు పోటీల నిర్వాహకులు నాగారపు రామకృష్ణ, బొమ్మిన శ్రీను, పలిశెట్టి హనుమంతురావు, బొమ్మిన శేషగిరిరావు, చింతపల్లి రామ్మూర్తి తెలిపారు.

పుల్లడిగుంటలో అన్న క్యాంటీన్ ప్రారంభం


అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న రామ్‌చౌదరి కుటుంబ సభ్యులు

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఆర్‌ఐ ఉప్పుటూరి రామ్‌చౌదరి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని స్వగ్రామమైన పుల్లడిగుంటలో తన తల్లి ఉప్పుటూరి సీతామహాలక్ష్మి జయంతిని పురస్కరించుకొని ఆదివారం అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. రామ్‌చౌదరి తండ్రి ఉప్పుటూరి శ్రీరాములు నేతృత్వంలో తానా ఫౌండేషన్ ఛైర్మన్ శశికాంత్ వల్లేపల్లి, తానా ప్రెసిడెంట్ నిరంజన్ శృంగవరపు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు అన్న క్యాంటిన్ ద్వారా భోజనాన్ని దగ్గరుండి వడ్డించారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇదే స్ఫూర్తితో తన తల్లి పేరుతో గ్రామంలో ప్రజలకు భోజనం అందించేందుకు అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడంపై పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పయనీర్ సంస్థల ఛైర్మన్ చుక్కపల్లి రమేష్, అశోక్ కొల్లా, వెంకట్ జిల్లెలమూడి, శ్రీరామన్నారాయణ పాల్గొన్నారు.


అన్న క్యాంటీన్‌లో భోజనానికి క్యూ

స్వచ్ఛజలం.. అందేనా?

(5 పేజీ తరువాయి)

కొరవడింది. పల్నాడు జిల్లా పరిధిలోని గ్రామాల్లో 4,34,399 గృహాలు ఉండగా ఇంకా 2,29,067 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి. 33.88 శాతంతో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా చిట్టచివరన 26వ స్థానంలో నిలిచింది. ఈ పథకం కింద 1055 పనులు గుర్తించి రూ.508.16 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. మూడో వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. బాపట్ల జిల్లా జలజీవన్ అమలులో రాష్ట్రంలో 25వ స్థానంలో నిలిచింది. జిల్లా పరిధిలోని గ్రామాల్లో 3,64,788 గృహాలకు 1,48,361 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. రూ.205.22 కోట్లు వ్యయం అంచనాతో జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టగా 223 పనులు పూర్తి చేశారు. గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలకు 1,57,724 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్‌లు ఉన్నాయి. కుళాయిల శాతం 53.34 శాతంతో జిల్లా 15వ స్థానంలో నిలిచింది. 308 పనులు చేపట్టగా 172 పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా పనుల్లో కదలిక కనిపించడంలేదు. కూటమి ప్రభుత్వం పనులను వేగవంతం చేయాలని గ్రామీణులు కోరుతున్నారు.

నూరు శాతం గ్రామాలివే..

- పల్నాడు జిల్లాలో కేవలం 14 గ్రామాల్లోనే నూరు శాతం గృహాలకు కుళాయిల కనెక్షన్ ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. అమరావతి మండల జూపూడి, చిలకలూరిపేట మండలం దండమూడి, గొట్టిపాడు, కుక్కపల్లివారిపాలెం, పోతవరం, తాతపూడి, వేలూరు, యడ్లపాడు మండలం సందెపూడి, సొలస, మాచవరం మండలం చెన్నాయపాలెం, నాదెండ్ల మండలం చిరుమామిళ్ల, సంకురాత్రిపాడు, రెంటచింతల, వినుకొండ మండలం విఠంరాజుపల్లి గ్రామాల్లో నూరు శాతం కుళాయి కనెక్షన్లు ఉన్నాయి.
- బాపట్ల జిల్లాలో పది గ్రామాల్లోనే నూరు శాతం కుళాయిలు ఇచ్చారు. అమృతలూరు మండలం కోడితాడిపర్రు, ఇంకొల్లు మండలం బీమవరం, ఇడుపులపాడు, జే పంగులూరు మండలం చందలూరు, నూజెళ్లపల్లి, రామకుర్రు, కారంచేడు మండలం కుంకలమర్రు, పర్చూరు మండలం అడుసుమల్లి, యద్దనపూడి మండలం వింజనంపాడు గ్రామాల్లో మాత్రమే నూరు శాతం ఇళ్లకు కుళాయి కనెక్షన్‌లు ఇచ్చారు.
- గుంటూరు జిల్లా పరిధిలో చేబ్రోలు మండలం గొడవర్రు, కాకుమాను మండలం బీకేపాలెం, బోడిపాలెం, గరికపాడు, పంద్రపాడు, రేటూరు, అన్నవరం, బొమ్మువానిపాలెం, కుంచవరం, మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, పెదకాకాని మండలం అనమర్లపూడి, తక్కెళ్లపాడు, తంగళ్లమూడి, వెనిగండ్ల, పెదనందిపాడు మండలం కొప్పర్రు, పొన్నూరు మండలం దొప్పలపూడి, జడవల్లి, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు, కొండవీడు, తుళ్లూరు మండలం అబ్బురాజుపాలెం, మల్కాపురం, వెలగపూడి, వట్టిచెరుకూరు మండలం కొవెలమూడి, కర్నూతల, వట్టిచెరుకూరు, యామర్రులోని అన్ని ఇళ్లకు కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని అధికారులు తెలిపారు.

గుంటూరు లోక్‌సభ పరిధిలో పచ్చదనాన్ని నింపుతాం

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్


మొక్కలకు నీరు పోస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన ఆలపాటి

తెనాలి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు లోక్‌సభ వ్యాప్తంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచి ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలందరూ ఆరోగ్యకరమైన జీవనం సాగించేలా పచ్చదనం - ప్రాణహితం కార్యక్రమాన్ని చేపట్టినట్లు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఆదివారం మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో సీసీఎల్ కాంటినెంట్ ఫ్యాక్టరీ ఎండీ రాజేంద్రప్రసాద్ సహకారంతో పచ్చదనం - ప్రాణహితం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ పచ్చదనం - ప్రాణహితం కార్యక్రమం తొలి అడుగు బుర్రిపాలెం గ్రామం నుంచి ప్రారంభించామన్నారు. రోడ్లకు ఇరువైపులా అందమైన చెట్లు ఉండేలా మొక్కలు నాటుతున్నామన్నారు. తొలి దశలో భాగంగా 300 మొక్కలను నాటుతున్నామని గుంటూరు పార్లమెంట్ వ్యాప్తంగా చెట్లు నాటే కార్యక్రమంలో భాగంగా కొన్ని వేల మొక్కలు నాటబోతున్నామన్నారు. సీసీఎల్ ప్రాజెక్ట్ తరుపున కాంటినెంటల్ ఫ్యాక్టరీ ఎండీ రాజేంద్రప్రసాద్ ఈ కార్యక్రమానికి సహకరిస్తూ ఏడాదికి రూ.50 లక్షల చొప్పున ఐదేళ్లలో రూ.2.50 కోట్లు అందించేందుకు హామీ ఇచ్చారని తెలిపారు. ఎన్‌ఆర్‌జీఎస్ పథకం ద్వారా మొక్కల సంరక్షణ బాధ్యతలు చేపట్టడం జరుగుతుందన్నారు. మాజీ మంత్రి, కృష్ణ - గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి క్షణం ప్రజల కోసం తపించే నాయకుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఐశ్వర్య దీపోత్సవం అజ్ఞానాన్ని తొలిగిస్తుంది

- తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామి


కార్తీక ఐశ్వర్య జ్వాలాదీపంకు నమస్కరిస్తున్న పీఠాధిపతులు శివస్వామి, ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక అమావాస్య రోజు దీపం వెలిగిస్తే 30 రోజుల పుణ్యం వస్తుందని తాళ్లాయపాలెం శైవ క్షేత్ర పీఠాధిపతులు శివస్వామి బోధించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ బాపట్ల జిల్లా అధ్యక్షుడు వెల్లంపల్లి సత్యనారాయణ, వాసవి సేవా సమితుల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బాపట్ల పట్టణంలోని రథం బజారులో కార్తీక ఐశ్వర్య జ్వాలదీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆధ్యాత్మికవేత్త బి.బాబునాగేంద్ర పర్యవేక్షించగా శివస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ 12 మాసాలలో కార్తీక మాసం అగ్రస్థానంలో ఉంటుందన్నారు. ఈ మాసంలో దీపం వెలిగిస్తే ఎంతో పుణ్యం వస్తుందన్నారు. నెలలో ఒక్కరోజు కూడా దీపం వెలిగించనివారు చివరి రోజు అమావాస్య నాడు దీపం వెలిగిస్తే నెలరోజుల పుణ్యఫలం వస్తుందన్నారు. కార్తీక ఐశ్వర్య జ్వాలా దీపోత్సవం వల్ల అజ్ఞానం తొలిగిపోయి జ్ఞానం పెంపొందుతుందన్నారు. ప్రజలంతా సుభిక్షంగా, సుసంపన్నంగా ఉండాలని ఆకాంక్షించారు. 7 కోట్ల మహామంత్రాల విశిష్టతను వివరించారు. భక్తులతో మంత్రాలు చెప్పించారు. అనంతరం కార్తీక ఐశ్వర్య జ్వాలదీపోత్సవాన్ని వెలిగించి భక్తులతో పూజలు చేయించారు.

- భావదేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

భావపురి పట్టణానికే తలమానికంగా ఉన్న భావదేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆకాంక్షించారు. అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, బెల్లంకొండ సత్యనారాయణ, సోమరౌతు నాగభూషణం, మామిడి రమేష్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఉమామహేశ్వరుల పల్లకిసేవ, గోదూళి, శాంతి మంత్రం, ప్రసాద వితరణ జరిగింది.


బాపట్ల రథం బజారులో కిక్కిరిసిన భక్తజనం

మిర్చి వ్యాపారి అక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు


నల్లపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న జీఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఆంజనేయులు

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో ఎగుమతిదారులు, రైతులను మోసగించిన కమీషన్ వ్యాపారిపై నల్లపాడు పోలీసులకు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(జీఏఎంసీ) అధికారులు ఫిర్యాదు చేశారు. యార్డులో 2023-28 సంవత్సరాలకు గోపు శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి శ్రీవిజయ భాస్కర్ ట్రేడర్స్ పేరుతో కమీషన్ ఏజంట్ లైసెన్స్‌ని పొందారు. అయితే అతను పల్నాడు జిల్లా నాదెండ్ల మండలంలోని ఇర్లపాడు గ్రామానికి చెందిన రంగనాధుల హరిబాబుకు చెందిన 200 మిర్చి బస్తాలు అమ్మి రూ.16,59,605 చెల్లించలేదు. అలానే మరో రైతు రంగనాధుల రామారావుకు చెందిన 300 బస్తాలు రూ.33,76,074 అమ్మి ఆ మొత్తాన్ని కూడా చెల్లించలేదు. మరోవైపు మిర్చి ఎగుమతిదారులకు తాను రైతులతో మిరపకాయలను ఇప్పిస్తానని చెప్పి వేల్ మురుగన్ అండ్ కో, శ్రీలీలా కృష్ణ ట్రేడర్స్, శ్రీగణపతి చిల్లీస్ ట్రేడర్స్ వద్ద రూ. 95 లక్షల లెటర్‌ప్యాడ్‌ల ద్వారా తీసుకొన్నారు. ఈ మేరకు అటు రైతులు, ఇటు ఎగుమతిదారులు జీఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులుకు ఫిర్యాదు చేయడంతో ఇప్పటికే గోపు శ్రీనివాసరెడ్డికి చెందిన లైసెన్సుని ఎందుకు రద్దు చేయకూడదో తెలియజేయాలని నోటీసు ఇచ్చారు. మరోవైపు నల్లపాడు పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసినట్లు సెక్రెటరీ తెలిపారు. శ్రీనివాసరెడ్డితో పాటు ఆయన భాగస్వామి కిషోర్‌రెడ్డిపై కూడా చర్యలు తీసుకొని సొమ్ము రికవరీ చేసి బాధితులకు ఇప్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు.

కొత్తూరు ఇక్కత్‌కు ఏఐ సాంకేతికత

మాచర్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరులో ఇక్కత్‌కు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) జోడించే అవకాశాలు ఉన్నాయని దక్షిణ భారత కేంద్ర హస్తకళల సంస్థ రీజనల్ డైరెక్టర్ లక్ష్మణరావు అన్నారు. కొత్తూరు గ్రామంలోని వీవర్స్ కాలనీలో ఆదివారం ఇక్కత్ హస్తకళాకారులకు మూడు నెలల శిక్షణతోపాటు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. వినియోగదారులు ఏ తరహా చీరలను, డ్రెస్ మెటీరియల్స్‌ను ఆదరిస్తారో తెలిపే ఏఐ సాంకేతికత కేవలం చెన్నై నిఫ్ట్ సంస్థలో మాత్రమే ఉందని, వారిని కొత్తూరుకు తీసుకొస్తామని చెప్పారు. ఏపీలో ఇక్కత్ క్లస్టర్ కొత్తూరలో మాత్రమే ఉందని, దీనికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ హస్తకళా సేవా కేంద్రం రవీంద్రగౌతం, అపిట్కో సీనియర్ కన్సల్టెంట్ ఐ.శ్రీనివాసరావు, పి.సుధీర్‌కుమార్, ఇండిపెండెంట్ జర్నలిస్టు పున్నా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక బాపట్లలో ప్రత్యక్షం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రగతి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలోని బధిరుల పాఠశాల హాస్టల్ నుంచి శనివారం అర్ధరాత్రి అదృశ్యమైన బాలిక (13) ఆదివారం బాపట్ల జిల్లా కొరిశపాడులో ప్రత్యక్షమైంది. ఈ విషయాన్ని ఆదివారం సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. నెల్లూరు జిల్లా బోగోలు మండలం తెల్లగుంటకు చెందిన తిరువీధుల సురేష్, చెంచుకుమారిల కుమార్తె కారుణ్యకు మూగ, చెవుడు. ఈ బాలిక గత ఏడాది నుంచి ప్రగతి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలోని బధిరుల పాఠశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటుంది. ఈ క్రమంలో 2నెలలుగా ఆ బాలికకు ఆరోగ్యం బాగులేకపోవడంతో తల్లి తీసుకెళ్లింది. శనివారం సాయంత్రం స్కూలుకు తీసుకువచ్చి వదిలిపెట్టి వెళ్లింది. అదే రాత్రి బాలిక గోడదూకి వెళ్లిపోయిందని హాస్టల్ నిర్వాహకులు బుచ్చి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వేకువజామున 3గంటలకు బాలిక తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. దీంతో వారు బాలిక ఆచూకీ కోసం బంధువులకు సమాచారమిచ్చి పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. హాస్టల్ నిర్వాహకులు సరైన సమాధానం చెప్పడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆదివారం రాత్రి 7గంటలకు బాలిక బాపట్ల జిల్లా కొరిసిపాడులోని తన పిన్నమ్మ ఇంటి వద్ద ఉన్నట్లు సీఐ శ్రీనావాసులురెడ్డి, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. కాగా హాస్టల్‌లో ఓ ఆయా తరచూ కొడుతూ వేధిస్తుంటుందని, అందువల్లే తమ బిడ్డ వెళ్లిపోయిందని తల్లి చెంచుకుమారి ఆవేదన వ్యక్తం చేశారు.

అత్యాచార ఘటనపై పోక్సో కేసు నమోదు

బాపట్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచార ఘటనలో ఓ వ్యక్తిపై బాపట్ల రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బాపట్ల రూరల్ సీఐ గంగాధర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం నగరం మండలానికి చెందిన 17 సంవత్సరాల బాలికను దేవరకొండపాలేనికి చెందిన కాగిత వినయ్‌కుమార్ కొన్ని రోజుల క్రితం మాయమాటలు చెప్పి సూర్యలంకకు తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాగిత వినయ్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మేనమామపై కేసు

తెనాలి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మేనమామపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని కొలకలూరు ఫ్లైఓవర్ బ్రిడ్జ్ కింద నివాసముంటున్న ఓ కుటుంబానికి చెందిన బాలికను వరుసకు మేనమామ అయ్యే వ్యక్తి తరుచూ అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో బాలిక కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులను ఆశ్రయించి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి

నరసరావుపేట లీగల్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో రెండు రోజులు పాటు నిర్వహించిన పల్నాడు జిల్లా పోలీస్ వార్షిక క్రీడోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారన్నారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులో కూడా కొనసాగించాలన్నారు. పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు జట్టు నిలిచింది. టగ్ ఆఫ్ వార్‌లోఎస్పీ జట్టు విజయం సాధించింది. ఫైనల్ పోటీలను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పరిపాలన అదనపు ఎస్పీ జైవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, ఏఆర్ డీఎస్పీ గాంధీరెడ్డి, నర్సరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కేవీడీ రామారావు జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు ఆర్‌ఎస్‌ఐలు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

హోంగార్డు, రైతుకు తీవ్ర గాయాలు

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో హోంగార్డు, రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివయ్య తెలిపిన వివరాల ప్రకారం.. భట్టిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న పడమటి లలిత్‌బాబు వేమూరు పోలీస్‌స్టేషన్‌కు తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గ్రామశివారులో పొలాలు పరిశీలించి వస్తున్న సంకటి వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయ పడ్డారు. 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 587.90 అడుగులు ఉంది. ఇది 306.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9104 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4881 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 16,385 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 16,385 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.


పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 41.69 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు రాజు తెలిపారు. ఎగువ నుంచి 3500 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద రెండు వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు



అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

బాపట్ల వార్తలు

సైబర్ నేరగాళ్ళతో అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ తుషార్ డూడి


మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరిట మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్ళ పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ స్టాక్ మార్కెట్‌ల పెట్టుబడుల పేరుతో వచ్చే తెలియని లింక్‌లు క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. ఆఫర్‌లు, లాభాల పేరుతో నమ్మించి సైబర్ నేరగాళ్ళ డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. నకిలీ వెబ్‌సైట్‌లతో లాభాల ఆశ చూపించి బ్యాంక్ ఖాతాలు ఖాళీ చేస్తున్నారన్నారు. జిల్లా పరిధిలోని ఒక వ్యక్తికి వాట్సప్‌లో స్టాక్‌మార్కెట్ పెట్టుబడుల పేరుతో ఒక లింక్ వచ్చిందన్నారు. ఆన్‌లైన్ ట్రేడి, ఐపివోలలో పెట్టుబడులు పెట్టటం ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. దీంతో బాధితుడు తన ఆధార్, పాన్‌కార్డు వివరాలతో ట్రేడింగ్ అకౌంట్ తెరిచాడు. మొదటగా సైబర్ కేటుగాళ్ళు చెప్పిన విధంగా కొంతమొత్తం డిపాజిట్ చేశాడు. నకిలీట్రేడింగ్ ఖాతాలో డబ్బులు వచ్చినట్లు చూపించాడు. అదినమ్మిన బాధితుడు బల్క్‌ట్రేడింగ్‌లో భారీ మొత్తంలో పెట్టుబడిపెట్టారు. ఒక వారం రోజులు స్టాక్స్ కలిగి ఉంటే మంచి లాభాలు వస్తాయని మరోసారి నమ్మించారు. అనంతరం బాధితులు లాభాలు కలిపి మొత్తం సుమారు రూ.40 లక్షలు చూపించారు. ఆ డబ్బును విత్‌డ్రా చేసుకునే ప్రయత్నం చేయటంతో సాధ్యంకాలేదు. విత్‌డ్రా చేసుకోవాలంటే మరింత డబ్బు పెట్టుబడి పెట్టాలని, కమీషన్ ఇతర ఛార్జీల పేరుతో మరింత డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయాలని ఒత్తిడి చేశారు. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్పీ వివరించారు. వాట్సప్, టెలిగ్రామ్‌లలో వచ్చే అపరిచిత లింక్‌లను క్లిక్ చేయొద్దని ఎస్పీ సూచించారు. ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే టోల్ ఫ్రీనెంబరు 1930కి కాల్ చేయటం ద్వారా లేదా వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బులను చాలా వరకు తిరిగి పొందే అవకాశం ఉంటుందన్నారు.

సాహితిభారతి ఆధ్వర్యంలో కథ విందాం కార్యక్రమం

బాపట్ల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : సాహితిభారతి ఆధ్వర్యంలో కథవిందాం కార్యక్రమం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రచయితలు కారుమంచి విజయకుమార్ చాయ్‌కప్పు కథ గురించి, ఆర్ట్స్ కాలేజి విశ్రాంత అధ్యాపకులు జి.శాంతారాం సత్కర్మలు కథ, బాపట్ల జిల్లా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు జీవి బ్రహ్మం సద్బుద్ధి, దుర్బుది కథను గురించి సభికులకు వివరించి ఆనందింపజేశారు. ఈ కార్యక్రమంలో రావూరి నరసింహవర్మ, సీనియర్ సిటిజన్స్ పట్టణ అధ్యక్షుడు కాగి శ్రీహరిరావు, కార్యదర్శి జేవి కృష్ణారావు, జీవీ సుబ్రహ్మణ్యం, కె.భద్రయ్య పాల్గొన్నారు.

వెదుళ్ళపల్లిలో వైద్యశిబిరం

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెదుళ్ళపల్లి గ్రామంలో ఆదివారం యజ్ఞ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ యజ్ఞ శ్రీకాంత్ ప్రారంభించి మాట్లాడుతూ పేద కుటుంబాల వారికి ఖరీదైన వైద్యసేవలు ఉచితంగా అందించేందుకు శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరంలో బీపీ, షుగర్, గుండెసంబంధిత వ్యాధుల పరీక్షలు నిర్వహించటం జరుగుతుందన్నారు. శిబిరంలో 300 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో కార్డియాలజిస్టు నిపుణులు, రేడియాలజి, స్త్రీల వైద్యనిపుణులు, ఎముకలు, కీళ్ళ శాస్త్ర నిపుణులు పాల్గొని రోగులకు సేవలందించారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలి : సీపీఐ

బాపట్ల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని శృంగారపురం సీపీఐ జిల్లా కార్యాలయంలో అఖిల భారత యువజన సమైక్య నాయకులు నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ అంటూ వాగ్దానాలు చేశారన్నారు. చేసిన వాగ్దానాలు అమలుకు నోచుకోలేదన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చి పేద ప్రజలకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు, రైతులకు మేలు చేసే విధంగా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ బిజిలి బాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి మామిడిబత్తుల అశోక్, పోలిరెడ్డి, కొండలురెడ్డి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు

కర్లపాలెం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని శ్రీరామకృష్ణ సేవాసమితిలో పేరలి నరసయ్య తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంతెన సత్యనారాయణరాజు సహకారంతో ఆదివారం కర్లపాలెంలోని శ్రీరామకృష్ణ సేవాసమితిలో డాక్టర్ చల్లా రామ్మోహనరావు రోగులకు వైద్య సేవలందించారు. బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తిమ్మరాజు వెంకట సుబ్బారావు, వ్యవస్థాపక అధ్యక్షుడు కాటూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి చందు పిచ్చయ్య, పెనుమెత్స బాపిరాజు, ముస్నం శ్రీనివాసరెడ్డి, ఆరె వెంకటేశ్వర్లు, మామిడాల సాంబశివరావు, జిడుగు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, కాటూరి బాజి, తూనుగుంట్ల లలిత బాబు తదితరులు పాల్గొన్నారు.

డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సులకు ఉచిత శిక్షణ

పిట్టలవానిపాలెం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఖాజీపాలెం కేవీఆర్‌కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల స్కిల్ హబ్ సెంటర్‌లో ఆదివారం డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులు మూడు నెలలు పాటు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థులైన నిరుద్యోగ యువతీ, యువకులు జిల్లాలోని వనరులు, డిమాండ్ ఆధారంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులను మూడునెలలు పాటు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.శివప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 18 నుంచి 35 సంవత్సరాలలోపు యువతీ, యువకులు డిసెంబరు 4వ తేదీలోగా వారి దరఖాస్తులను నమోదు చేసుకోవాలని తెలిపారు. శిక్షణా పూర్తి చేసుకునే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్టిఫికెట్‌లు అందజేస్తాయని స్కిల్ హబ్ ఇన్‌చార్జి హరీష్ తెలిపారు. తదితర వివరాలకు 9640695229 నెంబరును సంప్రదించాలని వారు కోరారు.

బహిరంగ మద్యపానంపై చర్యలు తప్పవు : సీఐ

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే చర్యలు తప్పవని పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జానీ హెచ్చరించారు. బాపట్ల కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాలలో విచ్చలవిడిగా రోడ్లపై, రోడ్లపక్కనే, రైల్వేట్రాక్ దగ్గర మద్యం సేవిస్తున్న వారిని పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం ఆయా ప్రాంతాలలో పోలీసు సిబ్బందితో కలిసి సీఐ తనిఖీలు నిర్వహించారు. ఇష్టానుసారంగా ప్రజలను ఇబ్బందిపెట్టేవిధంగా మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ధాన్యం అమ్మిన ఒక్క రోజులోనే నగదు జమ

చుండూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మకాలు జరిపిన రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతుంది. మండలంలోని మోదుకూరుకి చెందిన ఐదుగురు రైతులు శుక్రవారం తమ పంట ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మారు. ఆదివారం వారి ఖాతాల్లో జమ అయినట్లు సమాచారం అందింది. ఈమని శివారెడ్డికి రూ.1.59 లక్షలు, ఈమని శివకుమారికి రూ.3700, యడ్లూరి దేవిప్రసాద్‌కు రూ.84 వేలు, ముళ్ళపూడి అశోక్‌కు రూ.85,376, నల్లూరి ప్రసాద్‌కు రూ.15,776 నగదు జమ అయ్యాయి. ధాన్యం అమ్మిన ఒక్క రోజులోనే నగదు జమ కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నెలల తరబడి నగదు కోసం ఎదురు చూడాల్సి వచ్చేదని వారు తెలిపారు.

5న హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలి

కర్లపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావంను జయప్రదం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ ప్రచారక్ గౌతమ్‌జి అన్నారు. కర్లపాలెం శ్రీపెద్దింటమ్మ తల్లి దేవాలయంలో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం సాంబశివారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. గౌతమ్‌జి మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించారు. ఇస్కాన్‌టెంపుల్ చిన్మయికృష్ణదాసు అరెస్ట్‌కు నిరసనగా ఈనెల 4న సాయంత్రం బాపట్లలో నిరసన కార్యక్రమం జరుగుతుందని, నియోజకవర్గం నలుమూలల నుంచి హిందువులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం మండల బీజేపీ అధ్యక్షుడు సాంబశివారెడ్డి, నాయకులు బి.రామకృష్ణ, వల్లూరి భావన్నారాయణ, బొమ్మిశెట్టి బాలాజి, నందిపాటి నాగమల్లేశ్వరరావు, మద్దుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చెరుకుపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కోసం విశ్వహిందూ పరిషత్ ఆంధ్రప్రదేశ్ హైందవ శంఖారావం సభను 2025 జనవరి 5న విజయవాడలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సన్నాహక సమావేశం చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగింది. విశ్వహిందూ పరిషత్ నాయకులు,హిందూ చైతన్యవేదిక కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్లజిల్లా హిందూ పరిషత్ కో-కన్వీనర్ ఉప్పు సాంబశివరావు, హిందూ చైతన్య వేదిక కోట విజయ్, విస్సంశెట్టి శ్రీనివాసరావు, వేణు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు హైవెండ్ పూర్వవిద్యార్థిని ఎంపిక


నాగజ్యోతిని అభినందిస్తున్న ఫెన్సింగ్ సిబ్బంది

కర్లపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం హైవెండ్ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థిని కొమరగోరి నాగజ్యోతి జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైందని హైవెండ్ మేనేజింగ్ డైరెక్టర్ బొడ్డు సాయిమహేంద్రబాబు తెలిపారు. నవంబరు 26 నుంచి 28 వరకు నంద్యాలలో జరిగిన అండర్-19 ఎస్‌జిఎఫ్‌ఐ ఫెన్సింగ్ శాబర్ పోటీలలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి సిల్వర్‌మెడల్ కైవశం చేసుకొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. నాగజ్యోతి 68వ జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలలో బీహార్‌లోని పట్నాలో పాల్గొంటుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా నాగజ్యోతిని హైవెండ్ హైస్కూల్ యాజమాన్యం ఘనంగా సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ ఉదయచంద్రరావు, డైరెక్టర్‌లు అంజనేయప్రసాద్, చాంధిని, రఫీ, షర్మిలబేగం, రామలక్ష్మి, అనూష, లక్ష్మీప్రసన్న, జెరీనా, హిమబిందు, రమణ తదితరులు ఉన్నారు.

వేదమంత్రాలు, శ్లోకాల నుంచి ఆరోగ్య సమస్యలు పరిష్కారం

● శ్రీధాత్రే నమఃట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కంభంపాటి చెన్నకేశవశాస్త్రి

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వేద మంత్రాలు, శ్లోకాల నుంచి ఆరోగ్య సమస్యలు పరిష్కారమౌతాయని శ్రీధాత్రే నమఃట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కంభంపాటి చెన్నకేశవ శాస్త్రి అన్నారు. బాపట్ల కిరణా మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆరోగ్య సమస్యల పరిష్కారం గురించి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి డాక్టర్ కంభంపాటి ముఖ్యఅతిథిగా పాల్గొని పలు విషయాలు వివరించారు. మంతెన దశరథమహారాజు, నమ్మాని రాజ్‌గోపాల్, బూర్లె రత్తయ్య, బండ్ల శేషగిరిరావు, మలిశెట్టి పుల్లయ్య, డాక్టర్ శ్రీనివాస్, మామిడి రమేష్, బాలకృష్ణ, పువ్వాడ సుధీర్, వక్కలగడ్డ పవన్, మల్లిఖార్జున తదితరులు పాల్గొని ఈ విషయంపై చర్చించారు.

శ్రీబగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న డీఆర్వో


డీఆర్‌వో దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయానికి జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్ తమ కుటుంబ సభ్యులతో ఆదివారం విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు వారికి అమ్మవారి ఆలయ విశిష్టతలు గురించి వివరించారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయం దర్శించుకోవటం ఎంతో సంతోషదాయకంగా ఉందన్నారు. గంగాధర్‌గౌడ్ దంపతులకు వేద ఆశీర్వచనాలు అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికను, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెస్టివల్ అధికారి జి.నరసింహమూర్తి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్లలో మహిళా సమాఖ్య స్థాపన

బాపట్ల రూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : మహిళా సమాఖ్య బాపట్లను ఆదివారం ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సమాచార చట్టం కమిషనర్ శామ్యూల్ జోనాథన్, మరో అతిథి సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి పాల్గొని మాట్లాడుతూ ఆడపిల్లల చదువును ప్రోత్సహించటం, మహిళలు, పిల్లల ఆరోగ్య సమస్యలు, స్త్రీల దైనందిన సమస్యల పరిష్కారం కోసం కృషి, అందరికి న్యాయం జరిగే ఒక మంచి సమాజ నిర్మాణానికి కృషి చేయటం వంటి కార్యక్రమాలు మహిళా సమాఖ్య ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. అదేవిధంగా కమ్యూనిటి సైన్స్ కళాశాల గుంటూరు రిటైర్డ్ డీన్ జి.లక్ష్మి పాల్గొని మహిళలకు ప్రోత్సాహకమైన సందేశాన్ని ఇచ్చారు. బాపట్ల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా కోలా పద్మజ, వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీలక్ష్మి, జాయింట్ సెక్రటరిగా అనురాధ, కార్యదర్శిగా అనంతకుమారి, కోశాధికారిగా పి.లక్ష్మీ, సలహాదారుగా బి.శరత్ బోస్, లీగల్ సెల్ తోట రామాంజనేయులు కార్యవర్గసభ్యులను ప్రకటించారు.

అవగాహనతోనే ఆరోగ్యవంతమైన సమాజం

కర్లపాలెం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉంటే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ ఇనకొల్లు పోలీసురావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం రెడ్‌క్రాస్ కార్యాలయంలో అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో రెడ్‌క్రాస్ కీలకపాత్రపోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది పరమానందకుమార్, మల్లికార్జునరెడ్డి, సుబ్రహ్మణ్యం, కాశీ పాల్గొన్నారు.

మహాలింగేశ్వరునిగా స్వామివారి దర్శనం


మహాలింగేశ్వరునిగా స్వామి

బాపట్ల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్ఎస్‌పి అగ్రహారంలో ఉన్న శ్రీగంగాపర్వత వర్ధని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారు మహాలింగేశ్వరునిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు ప్రసాదస్వామి ఆధ్వర్యంలో గూడూరు చిట్టిబాబు, పంగులూరి కౌండిన్య, గూడూరు సాయి వెంకట్, నెమలికంటి హనుమంతరావు సహకారంతో ఆలయ ధర్మకర్తలు ఆదూరి హరి నారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తజనం అధిక సంఖ్యలో హాజరై పూజలు జరిపారు. గోపాళం లక్ష్మీనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

జూనియర్ అసిస్టెంట్ నేత్ర దానం

బాపట్ల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు మండలం జగ్గాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బాపట్ల మండలం అప్పికట్ల గ్రామానికి మునిపల్లె వెంకటేశ్వరస్వామి గుండెపోటుతో మృతి చెందాడు. అనంతరం శంకర్ కంటి హాస్పటల్, పెదకాకాని వారికి వేంకటేశ్వరస్వామి కోరిక మేరకు కుటుంబ సభ్యుల సహకారంతో ఆదివారం నేత్రదానం చేశారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

చెరుకుపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఆదివారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత రక్తనాళాల వైద్య శిబిరానికి 125 మంది హాజరయ్యారు. వారిలో 50 మందికి లేజర్ ట్రీట్‌మెంట్ చేయాలని డాక్టర్ సోమాచార్యులు, డాక్టర్ స్వాతి తెలిపారు. డాక్టర్ స్వాతి మాట్లాడుతూ హైదరాబాదులో ఉన్న తమ హాస్పిటల్‌కు ఈ 50 మందిని తీసుకుని వెళ్ళి ఉచితంగా వైద్య పరీక్షలు, లేజర్ ట్రీట్మెంట్ నిర్వహిస్తామని తెలిపారు. వారి కోసం ఉచితంగా సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ఆర్యవైశ్యకల్యాణ మండపం వద్ద బస్సు ఏర్పాటు చేసినట్టు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు విస్సంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.

ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలి

రేపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని రసాలయ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడే గౌరీశంకర్ అన్నారు. ఆదివారం ఎస్ఎస్ ఫౌండేషన్ రసాలయ కళాసమితి మహ్మద్ హిమాముద్దీన్‌ఖాదరీ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్ఎస్ అకాడమిలో ఉచిత గుండె జబ్బుల వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ హరూన్‌రషీన్ 200 మందికి ఉచిత గుండె పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. ఈకార్యక్రమంలో రసాలయ అధ్యక్షులు ఎం.రామచంద్రరావు, ఎస్ఎస్ ఫౌండేషన్ ఛైర్మన్ కె.దాసు, మేకా రామకృష్ణ పాల్గొన్నారు.

చెరుకుపల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఆవుల సాంబశివరావు

చెరుకుపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వార్షిక తనిఖీల నిమిత్తం చెరుకుపల్లి విచ్చేసిన రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ సిబ్బందికి నేరాలను ఎలా అదుపు చేయాలి, నేరాలు జరగకుండా ఎలా చూడాలి అని పలు సూచనలు చేశారు. సామాన్య ప్రజలు తమ ఫిర్యాదులను ఎటువంటి భయం లేకుండా ఇవ్వవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి రేపల్లె సీఐ సురేష్‌బాబు, చెరుకుపల్లి ఎస్ఐ అనిల్‌కుమార్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో మహారుద్ర హోమం


మహారుద్ర హోమంలో పాల్గొన్న భక్తులు

కొల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస పూజలు ఆదివారంతో ముగిశాయి. కొల్లూరులోని అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక అమావాస్య పురస్కరించుకుని మహారుద్ర హోమం నిర్వహించారు. మండల పరిధిలోని చిలుమూరు ఉభయ రామేశ్వర క్షేత్రం, కోటిపల్లిలోని సోమశేఖరస్వామి క్షేత్రాల్లో మాసోత్సవ పూజలు ముగిశాయి. నెల రోజుల పాటు స్వామి వారికి అభిషేకాలు చేయించుకున్న భక్తులకు ఆలయ అర్చకులు, సిబ్బంది తీర్థ ప్రసాదాలు అందించారు. సోమవారం పోలి పాడ్యమితో మార్గశిర మాసం మొదలవుతుందని, నెల రోజుల పాటు కార్తీక పూజలు ఆచరించిన భక్తులకు పోలిపాడ్యమితో పూజలు ముగుస్తాయి.

ఘనంగా గీతా జయంతి వేడుకలు

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని వెల్లటూరు గీతాజ్ఞానాశ్రమంలో కార్తీక బహుళ అమావాస్యను పురస్కరించుకుని గీతా ప్రచార మండలి గురూజీ శ్రీశైలార్యదేశిక స్వామి ఆశీస్సులతో గీతా మందిర ఆస్థాన పురోహితులు వంగర చలమయ్య ఆదివారం తెల్లవారుజామున కృష్ణ పరమాత్మకు పుష్పాలు, కర్పూరంతో గీతాతత్వ బ్రహ్మజ్ఞాన యజ్ఞం నిర్వహించారు. కురుక్షేత్ర సంగ్రామంలో శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి గీతను ప్రబోధించిన రోజు కార్తీక బహుళ అమావాస్య అని దాని వలన గీతా జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆశ్రమంలో కార్తీక వన సమారాధన జరిగింది. జయంతిని వేములపల్లి వనజాక్షమ్మ, కుటుంబ సభ్యులు నిర్వహించారు.

క్షేత్ర పాలకునికి మకర తోరణం, నాగాభరణం బహుకరణ


దాతలు బహుకరించిన మకర తోరణం, నాగాభరణంతో క్షేత్రపాలకుడు, కాలభైరవుడికి అలంకరణ

కొల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర పాలకునికి మకర తోరణం, నాగాభరణం బహుకరించారు. ఆదివారం కొల్లూరులోని ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ బలిజేపల్లి రామశాస్త్రి వారి కుటుంబ సభ్యులు అనంత భోగేశ్వరస్వామి ఆలయంలోని క్షేత్ర పాలకుడు, కాలభైరవుడు, సిద్ధి గణపతి, షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామికి మకర తోరణం, నాగాభరణం, ఛత్రం సమర్పించారు. ఆలయ అర్చకులు పూజాది కార్యక్రమాలు నిర్వహించి ఆభరణాలను స్వామివార్లకు అలంకరణ చేశారు.

వేంకటేశ్వరుని అలంకారంలో రామేశ్వర స్వామి


వేంకటేశ్వరస్వామి అలంకారంలో జంపని రామేశ్వర స్వామి

వేమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హరిహరాదులకు ప్రీతికరమైన కార్తీక మాసం అమావాస్య ఆదివారం పర్వదినాలను పురస్కరించుకుని మండలంలోని జంపని రామేశ్వరాలయంలో రామేశ్వర స్వామిని వేంకటేశ్వర స్వామిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. పండిత మామిళ్లపల్లి వెంకటసుబ్బరాయశర్మ కార్తీక మాస అమావాస్య వైశిష్ట్యాన్ని భక్తులకు వివరించారు. భక్త బృందాల వారు గోవింద నామస్మరణ, శివనామస్మరణ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చావలి వాలేశ్వరాలయం, వేమూరు రామలింగేశ్వరాలయాలలో విశేష అభిషేకాలు పూజలు నిర్వహించారు. బూతుమల్లి శివాలయంలో రెండు వేల మందికి అన్నదానం చేశారు. సోమవారం తెల్లవారుజామున పోలు పాడ్యమి పర్వదినం సందర్భంగా శివాలయాలలో విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

రహదారి వెంట మట్టి తొలిగింపు

కర్లపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం సెంటర్‌లో ఏట్రవారిపాలెం పంచాయతీలోని జాతీయ రహదారి వెంట పేరుకుపోయిన మట్టిని సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతులు ఆదివారం కూలీల ద్వారా తీయించారు. మట్టిని ట్రాక్టర్‌లలో పోసి బయటకు తరలించారు.

దశదిన కర్మకు వెళ్లి వస్తూ ఆటోడ్రైవర్ మృతి

చుండూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దుండిపాలేనికి చెందిన ఆటోడ్రైవర్ లంక బిక్షాలురెడ్డి (48) ఆదివారం చెరుకుపల్లి సమీపంలోని పొన్నపల్లిలో బంధువుల దశదిన కర్మ కార్యక్రమానికి భార్య, తన ఇద్దరు మగ పిల్లలతో వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి వస్తూ చెరుకుపల్లి వద్ద ఆటో దిగి జిలేబి కొనుగోలు చేయటానికి వెళ్లగా ఒక్కసారి గా కూలిపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది.

ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.1,09,487 చెక్కు పంపిణీ


సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదివారం పంపిణీ చేశారు. భట్టిప్రోలు గ్రామానికి చెందిన పచ్చిగల్ల రాజకుమారి అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందారు. చికిత్సకు అయిన ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించాలని బాధితులు ఎమ్మెల్యేను ఆశ్రయించగా ఆయన సిఫారసు మేరకు సిఎంఆర్‌ఎఫ్ కార్యాలయం నుంచి వచ్చిన ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.1,09,487 చెక్కును రాజకుమారికి ఎమ్మెల్యే గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే ఆనందబాబుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

గర్భిణులు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి

● జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ విజయమ్మ



సభలో మాట్లాడుతున్న డాక్టర్ విజయమ్మ, వేదికపై ప్రిన్సిపల్ సినియర్ సివిల్ జడ్జి వాణి

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు తప్పనిసరిగా హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఆదివారం డీఎం అండ్ హెచ్‌వో, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయం దగ్గర నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. తదుపరి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన సభలో డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ గర్భిణులకు పరీక్షలు చేయించటం వల్ల పాజిటివ్ వస్తే పుట్టబోయే బిడ్డకు హెచ్ఐవీ, ఎయిడ్స్ సంక్రమించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వాణి ఎయిడ్స్ రోగుల వెల్ఫేర్ గురించి వివరించారు. ఈ విషయంలో ఎన్జీవోస్ ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. న్యూట్రీషన్ ఫుడ్ అందించాలని, రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేయించుకునేలా బాధ్యత తీసుకోవాలని చెప్పారు. రోగుల సమాచారం గోప్యంగా ఉంచాలన్నారు. అనంతరం రంగోళి, వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ ఎస్.రోహిణి రత్నశ్రీ, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మానవాళికి భగవద్గీత మార్గదర్శి

● హిందూ ధర్మప్రచారపరిషత్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త అమ్మడు

బాపట్ల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన భగవద్గీత ప్రపంచంలో ప్రతి ఒక్కరు ఆచరించతగినదని, విశ్వమానవ క్షేమాన్ని కాంక్షిస్తుందని, శాంతి ప్రబోధానికి కారణమౌతుందని, ఆవేశం, ఆందోళన తొలిగించి విచారణ, విచక్షణకు మార్గనిర్దేశం చేస్తుందని హిందూ ధర్మప్రచారపరిషత్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త అమ్మడు తెలిపారు. పట్టణంలోని దర్శిపెదమస్తాన్ నగర్ శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో తిరుమల-తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం గీతాజయంతి నిర్వహించారు. విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. న్యాయనిర్ణేతలుగా సీహెచ్ అనంతలక్ష్మి, నందిపాటి తులసీ వ్యవహరించారు. 18 ఏళ్ళలోపు విభాగంలో సీహెచ్ నాగవెంకటతనుశ్రీ ప్రథమ బహుమతి, 18 ఏళ్ళుపైబడిన వారిలో టి.రేణుక ప్రథమ బహుమతి, టి.భారతి ద్వితీయ బహుమతి, టి.మాధవి తృతీయ బహుమతి సాధించారు. సీనియర్స్ విభాగంలో ఎ.లలిత శ్రీవిద్య, బి.రోషణ్, జూనియర్స్ విభాగంలో ఎ.దీప్తి, పి.శ్రీనికలు బహుమతులు సాధించారు. వీరికి జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, పదమటి వెంకటేశ్వరరావు, దర్శి కోటేశ్వరరావు, వర్ల అంజి గురుస్వామి, అర్చకులు ప్రసాద్, బొలగాని జయలక్ష్మి, వెంకటేశ్వర్లు, కొత్రా పద్మ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న హిందూ ధర్మప్రచారపరిషత్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త అమ్మడు తదితరులు

కుల, ఆదాయ ధ్రువపత్రాలు మంజూరులో జాప్యం తగదు

● తహసీల్దార్, ఆర్ఐ హాజరుకాకపోవటంతో జడ్పీటీసీ ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య

నిజాంపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసే సర్వసభ్యసమావేశానికి ప్రతిసారి తహసీల్దార్, ఆర్ఐ రాకుండా జూనియర్ సహాయకుడిని పంపించటం ఏమిటంటూ నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాంపట్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ విజయనిర్మల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూడునెలలకు ఒకపర్యాయం జరిగే ఈసమావేశానికి రెవెన్యూ అధికారులు రాకపోవటాన్ని ఉన్నతాదికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. రెవెన్యూశాఖలో అధికారులు విధులు నిర్వహించటం లేదని కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వటంలో జాప్యం జరుగుతుందని, తహసీల్దార్ కార్యాలయంలో డబ్బులేనిదే పని జరగటం లేదని అన్నారు. ఎంపీపీ విజయనిర్మల మాట్లాడుతూ అధికారులు ప్రొటోకాల్ పాటించాలని, అభివృద్ధి కార్యక్రమాల గురించి సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు తెలియపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి, ఎంఈవో శోభాచంద్, ఎంపీటీసీలు వెంకటేశ్వరరావు, హరనాథ్‌బాబు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రేపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనుమూడి గ్రామ వ్యవసాయ తనిఖీ కేంద్రం వద్ద సుమారు 35 నుండి 40 సంవత్సరాలు వయసు ఉన్న వ్యక్తి చనిపోయి ఉన్నాడని పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు తెలిపారు. ఒంటిమీద ఆకుపచ్చటి టీషర్టులాంటి షర్టు ఉందని తెలిపారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తు పట్టిన యెడల రేపల్లె పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పాత చెన్నై రహదారికి మోక్షం ఎప్పుడు?

- పెరిగిన వాహనాల రద్దీ
- తరచూ ట్రాఫిక్ సమస్యలు
- రోడ్డు అభివృద్ధికి ఎదురుచూపులు

పర్చూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వాహనాల రద్దీతో నిత్యం కిటకిటలాడే పాత చెన్నై (మద్రాస్) రోడ్డు అభివృద్ధికి మోక్షం కలిగేనా అన్న సందేహం అందరిలోనూ ఉంది. ఏళ్ల తరబడి ఈరోడ్డు అభివృద్ధి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ రోడ్డును జాతీయ రహదారుల జాబితాలో చేర్చాలని నాలుగేళ్ల కిందటే కేంద్ర మంత్రి నితిన్‌గట్కరీకి వినతులు కూడా అందజేశారు. దీనిపై పరిశీలించాలని ఆదేశాలు జారీ చేసినా సంబంధిత అధికారుల్లో చలనం లేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పాత మద్రాసు రోడ్డు అభివృద్ధిపై స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టిసారించారు. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని జాతీయ రహదారలు జాబితాలో చేర్చాలని కేంద్రానికి ప్రతిపాదన కూడా ఇచ్చారు. గుంటూరు నేషనల్ హైవే ఎన్‌హెచ్-5 నుంచి జాతీయ రహదారి నాగులుప్పలపాడు వరకు దాదాపు 80 కిలో మీటర్ల మేర రోడ్డును విస్తరించి అభివృద్ధి చేస్తే గుంటూరు - బాపట్లతోపాటు ప్రకాశం జిల్లాలోని ప్రజలకు



గుంటూరు - పర్చూరు మీదుగా పాత చెన్నైకి వెళ్లే రోడ్డులో రద్దీ

వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రాష్ట్ర రాజధాని అమరావతికి వెళ్లేందుకు దగ్గర మార్గంగా ఏర్పడుతుంది. రోడ్డును డబుల్ లైన్‌గా విస్తరించేందుకు సరిపడా వెడల్పు ఉన్నందున భూసేకరణ చేయాల్సిన అవసరం కూడా లేదు. ప్రత్తిపాడు, పెద్దనందిపాడు, పర్చూరు, ఇంకొల్లు, రాపూడి, కొణికి తదితర గ్రామాల్లో సైతం రహదారిని ఆక్రమించుకొని అంచుల్లో డ్రైనేజీ కాలువను పూడ్చి నిర్మాణం చేసుకున్న కట్టడాలను తొలగించి రహదారిని విస్తరిస్తే భూసేకరణతో అవసరం లేకుండా సురక్షమైన రహదారి మార్గం ఏర్పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పీపీ పద్ధతిలో గుంటూరు నుంచి పర్చూరు వరకు 42 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం చేపట్టేలా ప్రతిపాదన చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం కన్నా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈరోడ్డును జాతీయ రహదారుల జాబితాలో చేర్చడం వల్ల ప్రభుత్వానికి భారం తగ్గడంతోపాటు, ప్రయాణికులకు టోల్ గేట్ బెడద కూడా తక్కువగా ఉంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పాత చెన్నై రహదారిని అభివృద్ధి చేయడం వల్ల చెన్నై, కోల్‌కతా, ఒంగోలు, దిగమర్రు వంటి జాతీయ రహదారులకు ప్రత్యామ్నాయంగా ఉంటుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా పాత మద్రాసు రోడ్డును అభివృద్ధి చేస్తే ఈప్రాంతం ట్రాన్స్ పోర్టు సౌకర్యంతోపాటు, ఆయా మార్గాలకు ప్రయాణం సులభతరం అవుతుందని ప్రజలు, వాహన దారులు అంటున్నారు. ఆదిశగా అధికారులు ప్ర జా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పాత చెన్నై రోడ్డును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అనధికార లేఅవుట్ల వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

నోటీసులిస్తాం .. రుసుం వసూలు చేస్తాం

- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు
- అక్కాయిపాలెం పరిధిలో అక్రమ లేఅవుట్ల పరిశీలన

వేటపాలెం(చీరాల), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూములను, వ్యవసాయేతర అవసరాలకు ఉపయోగించేందుకు రియల్ వ్యాపారులు, ఇతరులు ఎవరైనా సరే నిబంధనల మేరకు రుసుం చెల్లించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు చెప్పారు. లేదంటే తగిన చర్యలు చేపడతాం, ముందుగా నోటీసులు ఇచ్చి రుసుం వసూలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. మండల పరిధిలో పలు ప్రాంతాల్లో వేసిన అనధికారిక లేఅవుట్లను, ఖాళీ స్థలాలను ఆదివారం ఆర్డీవో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలసి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా అక్కాయిపాలెం పంచాయతీ పరిధిలో 216 జాతీయ రహదారి పక్కన అనధికారిక అలేవుట్‌గా పంచాయతీ వారు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన ప్రదేశంతో పాటు పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లతో అంతిమంగా కొనుగోలుదారులు నష్టపోతారన్నారు. ఈ క్రమంలో ముందస్తుగా తాము ప్రత్యేక కార్యాచరణతో చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. నిబంధనలు పాటిస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, వీఆర్వో బాషా పాల్గొన్నారు.

స్వచ్ఛజలం.. అందేనా?

(5వ పేజీ తరువాయి)

కొరవడింది. పల్నాడు జిల్లా పరిధిలోని గ్రామాల్లో 4,34,399 గృహాలు ఉండగా ఇంకా 2,29,067 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి. 33.88 శాతంతో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా చిట్టచివరన 26వ స్థానంలో నిలిచింది. ఈ పథకం కింద 1055 పనులు గుర్తించి రూ.508.16 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. మూడో వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. బాపట్ల జిల్లా జలజీవన్ అమలులో రాష్ట్రంలో 25వ స్థానంలో నిలిచింది. జిల్లా పరిధిలోని గ్రామాల్లో 3,64,788 గృహాలకు 1,48,361 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. రూ.205.22 కోట్లు వ్యయం అంచనాతో జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టగా 223 పనులు పూర్తి చేశారు. గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలకు 1,57,724 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్‌లు ఉన్నాయి. కుళాయిల శాతం 53.34 శాతంతో జిల్లా 15వ స్థానంలో నిలిచింది. 308 పనులు చేపట్టగా 172 పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా పనుల్లో కదలిక కనిపించడంలేదు. కూటమి ప్రభుత్వం పనులను వేగవంతం చేయాలని గ్రామీణులు కోరుతున్నారు.

నూరు శాతం గ్రామాలివే

- పల్నాడు జిల్లాలో కేవలం 14 గ్రామాల్లోనే నూరు శాతం గృహాలకు కుళాయిల కనెక్షన్ ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. అమరావతి మండల జూపూడి, చిలకలూరిపేట మండలం దండమూడి, గొట్టిపాడు, కుక్కపల్లివారిపాలెం, పోతవరం, తాతపూడి, వేలూరు, యడ్లపాడు మండలం సందెపూడి, సొలస, మాచవరం మండలం చెన్నాయపాలెం, నాదెండ్ల మండలం చిరుమామిళ్ల, సంకురాత్రిపాడు, రెంటచింతల, వినుకొండ మండలం విఠంరాజుపల్లి గ్రామాల్లో నూరు శాతం కుళాయి కనెక్షన్లు ఉన్నాయి.
- బాపట్ల జిల్లాలో పది గ్రామాల్లోనే నూరుశాతం కుళాయిలు ఇచ్చారు. అమృతలూరు మండలం కోడితాడిపర్రు, ఇంకొల్లు మండలం బీమవరం, ఇడుపులపాడు, జే పంగులూరు మండలం చందలూరు, నూజెళ్లపల్లి, రామకుర్రు, కారంచేడు మండలం కుంకలమర్రు, పర్చూరు మండలం అడుసుమల్లి, యద్దనపూడి మండలం వింజనంపాడులో ఇళ్లకు కుళాయి కనెక్షన్‌లు ఇచ్చారు.
- గుంటూరు జిల్లా పరిధిలో చేబ్రోలు మండలం గొడవర్రు, కాకుమాను మండలం బీకేపాలెం, బోడిపాలెం, గరికపాడు, పంద్రపాడు, రేటూరు, అన్నవరం, బొమ్మువానిపాలెం, కుంచవరం, మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, పెదకాకాని మండలం అనమర్లపూడి, తక్కెళ్లపాడు, తంగెళ్లమూడి, వెనిగండ్ల, పెదనందిపాడు మండలం కొప్పర్రు, పొన్నూరు మండలం దొప్పలపూడి, జడవల్లి, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు, కొండవీడు, తుళ్లూరు మండలం అబ్బరాజు పాలెం, మల్కాపురం, వెలగపూడి, వట్టిచెరుకూరు మండలం కొవెలమూడి, కర్నూతల, వట్టిచెరుకూరు, యామర్రు గ్రామాల్లో అన్ని ఇళ్లకు కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని అధికారులు తెలిపారు.

నేడు హైస్కూల్‌లో మోడల్ పరీక్ష

మార్టూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉద యం ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్షను అన్ని జడ్పీ హైస్కూల్స్‌లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు చింతల సుబ్బారావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగమైన ఈ మోడల్ పరీక్షను అందరూ రాయాలని కోరారు.

అద్దంకిలో వరుస దొంగతనాలతో నిఘా పెంచిన పోలీసులు

- రాత్రి సమయంలో శివారు ప్రాంతాలు, ప్రధాన రోడ్లు, శింగరకొండలో తనిఖీలు
- సీసీ కెమెరాలకు మరమ్మతులు



ఆర్టీసీ బస్టాండ్‌లో పరిశీలిస్తున్న ఎస్ఐ

అద్దంకి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలో గత ఐదారు నెలలుగా వరుస దొంగతనాలతో ప్రజలకు కునుకు లేకుండా పోయింది. అదే సమయంలో చోరీలు జరగకుండా చేయడం పోలీస్‌లకు సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. దీంతో అద్దంకి పోలీసులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలకు బాగు చేయించారు. అదే సమయంలో పగలు, రాత్రి సమయాలలో గస్తీని పెంచారు. సీఐ కృష్ణయ్య, ఎస్ఐ ఖాదర్ బాషా సిబ్బంది తో కలిసి బృందాలుగా ఏర్పడి రాత్రి సమయాల్లో గస్తీని మరింత పెంచారు. ప్రధానంగా నామ్ రోడ్డు వెంబడి, ఆర్టీసీ బస్టాండ్, భవానీసెంటర్, శింగరకొండ గుడి తదితర ప్రాంతాలతో పాటు పట్టణంలోని శివారు ప్రాంతాలలో గస్తీ తిరుగుతున్నారు.



శింగరకొండ దేవాలయం వద్ద విశ్రాంతి హాల్‌లో పరిశీలిస్తున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు, యాచకులు, శింగరకొండ గుడి వద్ద భక్తులు ఎక్కువ సంఖ్యలో రాత్రి సమయాలలో నిద్రిస్తుండడంతో ఆయా ప్రాంతాలలో సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి నిఘా పెట్టినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. అదే సమయంలో ప్రజలు కూడా ఒకింత అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు తారస పడితే వెంటనే సమాచారం అందించాలని కోరారు. రాత్రి సమయంలో ఇంటి ఆవరణలో ఖచ్చితంగా లైట్లు వేసి ఉంచాలని, తలుపులకు లోపల వైపున కూడా తాళాలు వేసుకోవాలని సూచిస్తున్నారు.

అమావాస్య పూజలకు భక్తుల తాకిడి

చీరాల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : పేరాల గంగా, భ్రమరాంబ సమేత పునుగు రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమావస్య ప్రత్యేక పూజలకు వేకువజాము నుంచి భక్తులు పోటెత్తారు. గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన, ఆకాశదీపం, మంత్రపుష్పం తదితర విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

ఆసుపత్రిలో పింఛన్ పంపిణీ

పర్చూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పింఛన్ పంపిణీని కూటమి ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తోంది. శనివారం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్‌లను అందజేశారు. ఆరోగ్యం బాగులేక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి వివరాలను సేకరించి ఆదివారం ఆసుపత్రికి వెళ్లి పింఛన్‌ను పంపిణీ చేశారు. మండలం నాగులపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు రోడ్డు ప్రమాదంలో గాయపడి చిలకలూరిపేట ఆసుపత్రిలో ఉండగా ఆదివారం గ్రామ కార్యదర్శి అక్కడకు వెళ్లి ఆమెకు పింఛన్‌ను సొమ్ము అందజేశారు.

విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో మెలగాలి

చీరాలటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలని శ్రీగౌతమి జూనియర్ కళాశాల డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు (ఎంవీ) అన్నారు. 2021-23 ఇక్కడ చదివిన విద్యార్థులు ప్రస్తుతం పలు చోట్ల ఇంజనీరింగ్ చదువుతున్నారు. అయితే అప్పట్లో వీరు ఇంటర్‌లో ఉన్నతమైన మార్కులు సాధించడంతో ప్రతిభా పురస్కారాలను అందుకున్నారు. ఈసందర్భంగా ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతిభా పురస్కారాలకు ఎంపికయిన వారికి నాలుగు ఏళ్లపాటు ఏటా రూ.58,500 అందుతుందన్నారు. దీంతో అం దరూ వీరిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్ ప్రసాద్, అధ్యాపకులు టీవీఎల్ఎన్, వరప్రసాద్, ఎంఎస్ఆర్, ఏవో శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి

చినగంజాం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జనవరి 5న విశ్వహిందూ పరిషత్ వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న హైందవ శంఖారావంలో హిందువులందరూ లక్షలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆర్ఎస్ఎస్ జిల్లా సేవా ప్రముఖ్ గుగ్గిలం తులసీరావు పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుని వ్రతం

చినగంజాం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారి రాము ఆధ్వర్యంలో ఆలయంలోని స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలో విశేషంగా అలంకరించిన మండపంలో స్వామి చిత్రపటాన్ని పూలమాలలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు సోమసుందరశాస్త్రి వేదమంత్రాల నడుమ దంపతులచే సామూహికంగా వ్రతాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీక మాస వనభోజనాలు చేశారు. ఆలయ సేవాదళ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా వీరరాఘవస్వామికి పూజలు

చీరాలటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వీర రాఘవస్వామి దేవస్థానంలో ఘనంగా కార్తీకమాస చివరి రోజు వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా 1008 తామర పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరిగా కోటి దీపార్చన చేశారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ఆలయ కార్య నిర్వహణ అధికారి చిన్ని కృపారావు, దిట్టకవి వాసుదేవాచార్యులు పర్యవేక్షించారు.

సుబ్బరామరెడ్డికి నివాళి

మార్టూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పాతికేళ్ల క్రితం మండలంలోని వలపర్ల గ్రామంలో తమ ట్రస్టు ద్వారా జూనియర్ కాలేజీ ఏర్పాటుకు కృషి చేసిన స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం కళాశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. మాగుంట విగ్రహానికి మాజీ సర్పంచ్ కొల్లిపర పూర్ణచంద్రరావు, నేతాజీ విద్యా సంస్థల డైరెక్టర్ సయ్యద్ కరిముల్లా పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తాటికల్లు శాంపిల్స్ సేకరణ

చీరాలటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని దండుబాట, జాండ్రపేట ప్రాంతాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా తాటి కల్లు శాంపిళ్లను వారు సేకరించారు. అధికారులు మాట్లాడుతూ నాణ్యంగా కల్లు విక్రయాలు జరుగుతున్నాయా లేక ఏదైనా రసాయనాలు కలుస్తున్నాయా తెలుసుకునేందుకు కల్లు శాంపిల్స్ సేకరించినట్లు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. అలాగే సాయి కాలనీలో దాడులు నిర్వహించి అక్రమ మద్యం విక్రయాలు జరుపుతున్న మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద ఉన్న 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.



అమ్మవారి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

చల్లగా చూడమ్మా.. నాగవరపమ్మా

అమ్మవారి ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం, ఆదివారం, అమావాస్య కలసి వచ్చిన విశిష్ట రోజు కావడంతో ఆదివారం రామన్నపేట పంచాయతీ పరిధిలోని శ్రీ కనక నాగవరపమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలసి అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరినీ చల్లగా చూడమ్మా .. నాగవరపమ్మ తల్లీ అంటూ వేడుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈవో పోతిని శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే కొండయ్యను సాదరంగా ఆహ్వానించారు. పూజా కార్యక్రమాల అనంతరం సన్మానించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. భక్తులతో కాసేపు మాట్లాడారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. కొందరు కోరిన కోర్కెలు నెరవేరడంతో మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బృందాలుగా భోజనాలు తయారు చేసుకుని తిన్నారు. కొందరు అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలను నిర్వహించుకున్నారు. భక్తుల రద్దీతో తిరునాళ్ల వాతావరణాన్ని తలపించంది. సినీ నటుడు అజయ్‌ఘోష్ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణుగోపాలరావు, సూపరింటెండెంట్ రమేష్‌నాయక్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కఠారివారిపాలెం తీరంలో ప్రత్యేక పూజలు

ఆదివారం కఠారివారిపాలెం సముద్రతీరంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. మత్స్యకారులతో మాట్లాడారు. వారు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల భర్తీకి 9న పరీక్ష

బల్లికురవ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న 10 మండలాల్లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల భర్తీకి ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పర్యవేక్షణలో ఈనెల 9వ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కవిత ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్ డీలర్ల పోస్టులపై ఆసక్తి కలిగిన వారు వెంటనే తహసీల్దార్ కార్యాలయంలో వివరాలను తెలుసుకోవాలని ఆమె కోరారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా 2వ తేదీన జరగాల్సిన రాత పరీక్ష 9వ తేదీకి వాయిదా పడిందని తెలిపారు.

చికిత్స పొందుతూ టీడీపీ కార్యకర్త మృతి



శ్రీనివాసరావు మృతదేహం

బల్లికురవ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్రెపాడుకు చెందిన ఐ-టీడీపీ కార్యకర్త గుంటూరు శ్రీనివాసరావు (34) శనివారం అర్ధరాత్రి వైద్య శాలలో చికిత్స పొం దుతూ మృతి చెందాడు. గొర్రెపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు కొంతకాలం కిందట మంత్రి నారా లోకేష్ టీంలో పనిచేసి ఉన్నాడు. రెండేళ్ల కిందట స్వగ్రామానికి వచ్చి గ్రామంలో ఉంటూ ఆర్థికంగా బాగా దెబ్బతిని అప్పులపాలు అయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన శ్రీనివాసరావు శనివారం ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే వారి బంధువులు చిలకలూరిపేట వైద్యశాలకు తరలించారు. ఈ విషయం మంత్రి లోకేష్ దృష్టికి వెళ్లగానే వెంటనే విజయవాడ వైద్యశాలకు ఉన్నత చికిత్సకు తరలించాలని పార్టీ నేతలకు అదేశాలు ఇవ్వగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ ఆసుపత్రికి వెళ్లి శ్రీనివాసరావును విజయవాడ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అండగా ఉంటాం : మంత్రి గొట్టిపాటి

గొర్రెపాడు గ్రామానికి చెందిన ఐటీడీపీ కార్యకర్త శ్రీనివాసరావు మృతి చెందడం బాధకరం అని అయన కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీనివాసరావు మృతి చెందిన విషయానిన తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. కార్యకర్తలు ఎవరైనా ఇబ్బందులు వస్తే ఆత్మహత్యలు చేసుకోవద్దని పార్టీ అండగా ఉంటుందని సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే పార్టీ పరంగా ఆదుకుంటామని ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు.

ప్రారంభమైన క్రిస్మస్ క్యారల్స్

చినగంజాం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్‌నగర్‌లో క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రిస్మస్ క్యారల్స్ కార్యక్రమాన్ని ఆదివారం వేకువజామున ఘనంగా ప్రారంభించారు. ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మేకల మేషక్‌బాబు తెలిపారు. అంబేడ్కర్‌నగర్ గ్రామ పెద్దలు, ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో క్యారల్స్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు మేడికొండ ప్రభుకుమార్, ధనుంజయ్ కేకు కట్ చేసి సండే స్కూల్ చిన్నారులకు, యువతీయువకులకు పంచి పెట్టారు. అనంతరం చినగంజాం గ్రామ పురవీధులలో క్రిస్మస్ క్యారెల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

బల్లికురవ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమవరం గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి బైకుపై వస్తున్న వారిని గ్రానైట్ లారీ ఢీకొనడంతో కొప్పరం గ్రామానికి చెందిన ఏడాదిన్నర వయసు చిన్నారి షేక్ కానున మృతి చెందింది. సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామానికి చెందిన షేక్ మున్నీర్ బాషా తన భార్యతో కలిసి పాపతో చిలకలూరిపేట వైద్యశాలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, ముందు గ్రానైట్ లారీ వెళుతుండగా మరో ఆటో లారీని క్రాస్ చేయబోతుండగా మున్నీర్ బాషా బైకును లారీ తగడంతో అదుపు తప్పి బైకు కింద పడిపోయింది. దీంతో తల్లి ఒడిలో ఉన్న పాప రోడ్డుపై పడి పోయి లారీ వెనుక భాగం తగిలి మృతి చెందింది. ఎస్ఐ జీవీ చౌదరి పరిశీలించారు. బాషా ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు

- ముమ్మరంగా గాలింపు
- రంగంలోకి చీరాల అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు



జస్వంత్



జస్వంత్ కోసం గాలిస్తున్న ఫైర్ సిబ్బంది

వీరన్నపాలెం(పర్చూరు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చెరువులో ఈతకు వెళ్లిన విద్యార్థి గల్లంతైన సంఘటన బాపట్ల జిల్లా, పర్చూరు మండల పరిధిలోని వీరన్నపాలెం పాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. చీరాలలోని ఓ ప్రైవేటు కళాశాలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న పాలేరు జస్వంత్ (17) చెరువులో ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. గ్రామానికి చెందిన పాలేరు శ్రీనివాసరావు, కోకిల దంపతులకు ఇద్దరు కుమారులు, అందులో చిన్న కుమారుడు జస్వంత్. తన స్నేహితులలో కలసి సమీపంలో ఉన్న పాఠశాలలో వాలీబాల్ ఆడుకొని తిరిగి ఇంటికి వస్తూ గ్రామంలోని మంచినీటి చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదానికి గురయ్యాడు. చెరువు లోతుగా ఉండడంతో దిగిన వెంటనే మునిగిపోయాడు. జస్వంత్‌తోపాటు, మరో ఇద్దరు యువకులు కూడా ఉన్నట్లు సమాచారం. గల్లంతైన యువకుని కోసం గ్రామస్థుల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మాల్యాద్రి సిబ్బందితో గ్రామానికి చేరుకొని చీరాల అగ్నిమాపక సిబ్బంది సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, చీరాల అగ్నిమాపక ఎస్ఐ డీవీ రామకృష్ణ పర్యవేక్షణలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు

కుమారుడు గల్లంతైన సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

హనుమకు కదళీ ఫలార్చన



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా ఆదివారం కదళీఫలార్చన నిర్వహించారు. ప్రాంతఃకాల పూజల అనంతరం వేద పండితులు, పూజారులు 10 వేల అరటిపండ్లతో 11 ఆవృత్తములుగా దశ సహస్ర కదళీఫలార్చన నిర్వహించారు. ఉభయ దాతలుగా గుంటూరుకు చెందిన న్యూ మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు.

కార్తీక మాసం చివరి రోజు ప్రత్యేక పూజలు

కార్తీక మాసం చివరి రోజు ఆదివారం శివాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి దేవాలల యం, అద్దంకి పట్టణంలోని కమేశ్వరాలయం, పాతశివాలయం, వేయిస్తంభాల గుడి తదితర దేవాలయాలలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం పోలిస్వర్గం పూజలు నిర్వహించనున్నారు.